హైదరాబాద్ వార్త





దామోదర్ సంజీవయ్య చౌరస్తా రహదారిపై టైర్లకు నిప్పు పెట్టిన గుర్తుతెలియని వ్యక్తులు

# రహదారిపై నిప్పు పెట్టారు

బేగంబజార్, మార్చి 17 ప్రభాతవార్త: టిఎస్‌పిఎస్‌సి పేపర్‌లీకేజీతో రాజకీయపార్టీలు, ప్రజాసంఘాలు, విద్యార్థి సంఘాలతో గత ఐదురోజుల నుంచి రాస్తారోకో, నిరసనలతో నగరం అట్టుడికిపోతుంది. బిజెపి, కాంగ్రెస్, తెలంగాణ వైయస్‌ఆర్ పార్టీ, సిపిఎం, సిపిఐ, ఎబివిపి, ఎస్‌ఎఫ్‌ఐలు తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కార్యాలయాన్ని ముట్టడించడం వంటి కార్యక్రమాలు చేపట్టారు. శుక్రవారం మధ్యాహ్నాం సమయంలో నాంపల్లిలోని కె.ఎల్.కె. భవనం ముందు ఉన్న ఏఆర్ పెట్రోల్ పంపు సమీపంలో ఉన్న మాజీ ముఖ్యమంత్రి దివంగత దామోదర్ సంజీవయ్య విగ్రహాం సమీపంలో గుర్తుతెలియని వ్యక్తులు టైర్లు తీసుకువచ్చి రహదారిపై టైర్లకు నిప్పు పెట్టారు. దీంతో ఆ ప్రాంతం గుండా వెళ్లే వాహనాదారులు భయాందోళనకు గురయ్యారు. టైర్లకు నిప్పు పెట్టిన సమీపంలో పెట్రోల్‌పంపు ఉంది. అటు వైపు లాల్ బహుదూర్ స్టేడియం, పోలీసు కంట్రోల్‌రూమ్ ఉన్నాయి. ఈ విషయం తెలుసు కున్న పోలీసులు వెంటనే రంగంలోకి దిగి మంటలను ఆర్పివేశారు. నిరసన కారులే టైర్లకు నిప్పు పెట్టి ఉండ వచ్చునని పోలీసులు అనుమానం వ్యక్తం చేశారు.

## బండి సంజయ్‌ని అరెస్టు చేసిన కార్ఖాన పోలీసులు



బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్‌ను అరెస్టు చేసిన కార్ఖానా పోలీసులు

అడ్డగుట్ట, మార్చి 17 ప్రభాతవార్త: తెలంగాణ రాష్ట్ర పబ్లిక్ సర్వీస్ కమీషన్ నిర్వహించిన ప్రశ్నాప్రత్రాలు లీకేజీ అయినందుకు నిరసనగా శుక్రవారం బిజెపి తలపెట్టిన ధర్నా కార్యక్రమంలో బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్‌ను అరెస్టు చేసిన కార్ఖాన పోలీస్ స్టేషన్ తరలించారు. ఈ కార్యక్రమంలో మహంకాలి జిల్లా అధ్యక్షుడు శ్యామ్ సుందర్ గౌడ్, మోండా డివిజన్ కార్పోరేటర్ కొంతం దీపిక నరేశ్, బిజెపి నాయకులు భానుక మల్లికార్జున్, అకుల నాగేశ్, రజనీ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## యువత ప్రాణాలను కాపాడుకోవాలి

**అసిస్టెంట్ కమీషనర్ ఆఫ్ పోలీస్ జి.శంకర్‌రాజు**

సైఫాబాద్, మార్చి 17 ప్రభాతవార్త: యువత సెల్‌ఫోన్‌లో మాట్లాడుకుంటూ రాంగ్‌రూట్‌లో వాహనాలు నడపడం వల్లనే తరుచు ప్రమాదాలు జరుగుతున్నాయని, దీంతో అమూల్యమైన ప్రాణాలను పోగొట్టుకుంటున్నారని కుటుంబాలలో విషాదం మిగుల్చుతున్నారని ట్రాఫిక్ ట్రైనింగ్ ఇనిస్టిట్యూట్ బేగంపేట అసిస్టెంట్ కమిషనర్ ఆఫ్ పోలీస్ జి.శంకర్‌రాజు ఆవేదన వ్యక్తం చేశారు. వాహనాలను అతివేగంతో నడపటం ప్రమాదకరమని ఈ విషయాన్ని ప్రతి ఒక్కరూ గుర్తుంచుకోవాలని సూచించారు. హిమాయత్ నగర్ లోని స్లేట్ ది స్కూల్‌లో రోడ్డు భద్రత, ట్రాఫిక్‌పై అవగాహన కార్యక్రమం జరిగింది. పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా స్టాప్‌లైన్, ట్రిబల్ రైడింగ్, ట్రాఫిక్ పోలీసులు ఏవిధంగా రోడ్డుపై ట్రాఫిక్ నియంత్రణలు చేస్తారో వాటి గురించి ఆయన చూపించడం జరిగింది. రహదారులపై క్రమశిక్షణగా వ్యవహారించాలని మీ రక్షణ, ప్రజల రక్షణ కోసం వాహనాలను జాగ్రత్తగా నడపాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో 200 మంది విద్యార్థులతోపాటు స్కూల్ సిబ్బంది, టీచర్స్, స్కూల్ కరస్పాండెంట్ వాసిరెడ్డి అమర్‌నాథ్, ప్రిన్సిపల సీమా, అడ్మిన్ దీపక్‌కుమార్, టిటిఐ ఎస్ఐ సిహెచ్ జ్యోతి, మాజీద్, చక్రధర్, చిరంజీవి, నారాయణగూడ ట్రాఫిక్ పోలీస్ స్టేషన్, లా అండ్ ఆర్డర్ పోలీసులు తదితరులు పాల్గొన్నారు.

## రవాణా కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

సీఐటియూ నగర అధ్యక్షులు కుమారస్వామి



దీక్షలో నినాదాలు చేస్తున్న ఏఐఆర్‌టీడబ్ల్యూఎఫ్ నాయకులు

ధర్నాచౌక్, మార్చి 17, ప్రభాతవార్త: రాష్ట్ర రవాణా కార్మికుల సమస్యలు తక్ష ణ మే పరిష్క రించాలని సీఐటియూ నగర అధ్యక్షులు కుమారస్వామి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఇందిరాపార్కు ధర్నాచౌక్‌లో ఆల్ ఇండియా రోడ్ ట్రాన్స్‌పోర్ట్ వర్కర్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో ట్రాన్స్‌పోర్ట్ వెల్ఫేర్ బోర్డును ఏర్పాటుచేయాలని, మోటార్‌వెహికల్ యాక్ట్ 2019ని సవరించాలని డిమాండ్ చేస్తూ కొనసాగుతున్న దీక్షలకు శుక్రవారం ఆయన ముఖ్యఅతిథిగా హాజరై ప్రసంగించారు. తెలంగాణ రాష్ట్రం వస్తే తమ బతుకులు బాగుపడతాయనే ఆశతో తెలంగాణ ఉద్యమంలో పాల్గొన్న రవాణా కార్మికుల సంక్షేమం తెలంగాణ ప్రభుత్వం పట్టించుకోవటం లేదని ఆరోపించారు. రవాణా కార్మికుల జీవితాలు దుర్భరంగా ఉన్నాయని, ప్రమాదంలో గాయపడినా, ఏదైనా అనారోగ్యం వచ్చినా ఆదుకునే దిక్కులేదని ఆవేదన వ్యక్తం చేశారు. వెంటనే ట్రాన్స్‌పోర్ట్ వెల్ఫేర్ బోర్డు ఏర్పాటుచేయాలని డిమాండ్ చేశారు. ఈఐఆర్‌టిడబ్ల్యూఎఫ్ నగర కార్యదర్శి కే.అజయ్‌బాబు మాట్లాడుతూ దేశ జీడీపీలో 4శాతం వాటా అందిస్తున్న రవాణా రంగాన్ని ప్రభుత్వాలు అశ్రద్ధ చేస్తున్నాయని ఆరోపించారు. ట్రాన్స్‌పోర్టు కార్మికులు లేకపోతే పనులు ముందుకు సాగవని, అత్యంత కీలకమైన వృత్తిలో ఉన్న రవాణా రంగ కార్మికుల సంక్షేమానికై చర్యలు తీసుకోవల్సి న బాద్యత ప్రభుత్వంపై ఉందని అన్నారు. ఈ కార్యక్రమంలో ఏఐఆర్‌టీడబ్ల్యూఎఫ్ నాయకులు కే.సతీష్, ఎండి కలీమ్, ఉమేష్‌రెడ్డి, అహ్మద్‌ఖాన్, శ్యామ్, గౌస్, మహేష్, అనిఫ్, మునీష్, సీఐటియూ నాయకులు డీఎల్ మోహన్ తదితరులు పాల్గొన్నారు.

## గ్రూప్-1 ప్రశ్నా పత్రాల లీకేజిపై సిబిఐచే విచారణ జరిపించాలి

సైఫాబాద్, మార్చి 17 ప్రభాతవార్త: గ్రూప్-1 ప్రశ్నా పత్రాలు లీకేజికి బాధ్యులైన తెలంగాణ రాష్ట్ర పబ్లిక్ సర్వీసెస్ కమిషన్ చైర్మన్, సభ్యులు, కార్యదర్శిపై కేసులు నమోదు చేసి తక్షణమే అరెస్టు చేయాలని దళిత బహుజన పార్టీ జాతీయ అధ్యక్షుడు వడ్లమూరి కృష్ణస్వరూప్, నేషనల్ డెమొక్రటిక్ సెక్యూలర్ ఫ్రంట్ మీడియా కన్వీనర్ సి.శ్యామ్‌కుమార్ రాష్ట్ర గవర్నర్‌కు విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు శుక్రవారం నాడిక్కడ ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ ప్రశ్నా పత్రాలు లీకేజి వెనుక బిఆర్‌ఎస్ మంత్రుల హస్తం ఉందని ఆరోపించారు. గత 8 సంవత్సరాలుగా కమిషన్‌లో ఈ అక్రమాల దందా నడుస్తున్నదని ప్రశ్నాపత్రాల లీకేజి అవినీతి, అక్రమాలపైన సిబిఐచే విచారణకు సిఎం కెసిఆర్ ప్రభుత్వం గవర్నర్‌కు సిఫార్సు చేయాలని డిమాండ్ చేశారు. గ్రూప్-1 పరీక్షలు రద్దుచేసి తిరిగి నిర్వహించాలని కోరారు.

# ఈ నిర్లక్ష్యానికి కారకులెవరు?

## వరుస అగ్ని ప్రమాదాలతో నగరవాసులు బెంబేలు

**మొన్న రూబీ హోటల్, డెక్కన్ మాల్.. ఇప్పుడు స్వర్ణలోక్ కాంప్లెక్స్**

**అనుమతులు లేకుండానే వేలల్లో వ్యాపార సముదాయాలు**

**చాలా ప్రాంతాల్లో కనిపించని ఫైర్ సేఫ్టీ**

**ప్రమాదాలు జరిగినప్పుడే అధికారులు హడావిడీ**



హైదరాబాద్, మార్చి 17, ప్రభాతవార్త: ఎలా చిచ్చురేగుతున్నాయో తెలియదు.. ఎక్కడి నుంచి వచ్చి ఎగిసిపడతాయో అర్థం కాదు. కనురెప్ప మూసి తెరిచే లోగా చెలరేగే మంటల్లో.. కనుచూపు మేరల్లో కమ్ముకునే పొగలో చిక్కి ఆహాకారలతోనే ఊపిరి ఆగిపోతుంది. సికింద్రాబాద్‌లో అర్నెళ్ల కాలంలోనే చోటు చేసుకున్న మూడు భారీ అగ్నిప్రమాదాలు మిగిల్చిన విషాదం అంతా ఇంతా కాదు. తాజాగా స్వప్నలోక్ ఘటనతో జంటనగరాలు మరోసారి ఉలిక్కిపడ్డాయి. ఇప్పటివరకు వరకు ఈ ప్రమాదాల్లో 29మంది దుర్మరణం చెందారు. తక్కువ సమయంలోనే వరుసగా అగ్ని ప్రమాదాలు జరుగుతున్నాయి. ప్రమాదాలు జరిగిన తర్వాత సహాయక చర్యలే తప్పా.. ఘటనలు చోటు చేసుకోకుండా ముందస్తు చర్యలు మాత్రం ప్రభుత్వం చేపట్టడం లేదు. గతేడాది సెప్టెంబర్ 12న సికింద్రాబాద్‌లోని పాస్‌పోర్టు కార్యాలయం సమీపంలో రూబీ లగ్జరీ ప్రైడ్ హోటల్‌లో జరిగిన ప్రమాదంలో 8మంది పర్యాటకులు ప్రాణాలు కోల్పోయారు. ఈహోటల్‌లో ఐదు అంతస్తుల భవనం ఉండగా సెల్లార్, గ్రౌండ్ ఫ్లోర్లలో రూబీ ఎలక్ట్రిక్ వాహనాలు షోరూం ,మిగిలిన నాలుగు అంతస్తుల్లో హోటల్ నిర్వహిస్తున్నారు. గ్రౌండ్‌ఫ్లోర్ లో ఉన్నట్లుండి మంటలు చెలరేగటంతో విద్యుత్ షార్ట్‌సర్క్యూట్ జరిగి.. ఆవేడికి షోరూంలోని ఎలక్ట్రిక్ వాహనాల బ్యాటరీలు పేలాయి. దీంతో మంటల ఉధృతి పెరిగి.. వాహనాలకు వ్యాపించడంతో పెద్దఎత్తున మంటలు ఎగిసిపడ్డాయి. మెట్లమార్గం ద్వారా మంటలు పైఅంతస్తులకు వ్యాపించగా.. వాహనాలు, బ్యాటరీల కారణంగా దట్టమైన పొగ అలుముకుంది. ఈప్రమాదంలో ఊపిరి ఆడక లాడ్జీలో వసతి పొందుతున్న 8మంది పర్యాటకులు ప్రాణాలు కోల్పోయారు. అలాగే ఈఏడాది జనవరి 19న దక్కన్ స్పోర్ట్ కాంప్లెక్స్ సెల్లార్‌లోని దుకాణం నుంచి వెలువడిన మంటలు అలజడి సృష్టించాయి. నిమిషాల్లోనే మూడు వైపుల నుంచి మంటలు వ్యాపించి ఐదు అంతస్తులకు వ్యాపించాయి. ఉదయం 11గంటల నుంచి రాత్రి 11గంటల వరకు 120మంది అగ్నిమాపక అధికారులు, సిబ్బంది నిర్విరామంగా కష్టపడితే తప్పా మంటలు అదుపులోకి రాలేదు. పక్క భవనాలను మంటలు విస్తరించడంతో ఏకంగా 20కిపైగా ఫైర్ ఇంజన్లు శ్రమించాల్సి వచ్చింది. చివరకు సహాయక సిబ్బందే సృహతప్పిన పరిస్థితి ఎదురైంది. ఈప్రమాదంలో ముగ్గురు సజీవ దహనం కావడంతో వారి ఎముకలైనా దొరకని దుస్థితి నెలకొంది. తాజాగా మార్చి 16న నిత్యం రద్దీగా ఉండే స్వప్నలోక్ కాంప్లెక్స్‌లో జరిగిన అగ్నిప్రమాదం ఆరుగురిని బలితీసుకుంది. వస్త్రదుకాణాలతోపాటు కంప్యూటర్ ఇనిస్టిట్యూట్‌లు, కాల్‌సెంటర్లు, ఇతర ప్రభుత్వ ప్రైవేట్ కార్యాలయాలతో సందడిగా ఉండే ఈభవనంలో ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. ఈక్రమంలోనే పెద్దఎత్తున పొగ అలుముకోగా.. పెయింట్ డబ్బాలు లాంటివి పేలడంతో ప్రమాద తీవ్రత మరింత పెరిగింది. ఈక్రమంలో 15మందికి పైగా మంటల్లో చిక్కుకుపోయారు. సహాయకసిబ్బంది ఏడుగురిని అతికష్టం మీద బయటికి తీసుకువచ్చారు. మరోఅంతస్తులో చిక్కుకుని అస్వస్థకుగురైన ఆరుగురిని గుర్తించారు. వారిని ఆస్పత్రికి తరలించినా ప్రామాణాలు దక్కలేదు.

**అధికారుల చర్యలు లేనందునే..** ఇలా అర్నెళ్ల కాలంలోనే ఒకేప్రాంతంలో జరిగిన మూడు భారీ అగ్నిప్రమాదాలు నగరవాసులను ఉలిక్కిపడేలా చేశాయి. భారీ ఆస్తినష్టానికి తోడు అమాయకుల ప్రాణాలు మంటల్లో కలుస్తున్నాయి. అధికారులు ఏమాత్రం అప్రమత్తత చర్యలు మాత్రం తీసుకుంటున్నట్లు కనిపించడం లేదు. ప్రమాదం జరిగినప్పుడు మంటలను అదుపుచేసేందుకు సహాయక సిబ్బంది తీవ్రంగా కష్టపడాల్సి వస్తోంది. నిబంధనలు ఉల్లంఘించి ప్రమాదకర పరిస్థితుల్లో వ్యాపారాలు సాగుతున్నా.. కఠినంగా వ్యవహారించడంలో మాత్రం అధికార యంత్రాంగం విఫలమవుతుంది. అనుమతిలేని అంతస్తులు, గృహాఅవసరాల కోసం నిర్మించిన ఇళ్లు భారీగా వ్యాపార సముదాయాలుగా మారడం, రోడ్ల ఆక్రమణ జరుగుతన్నా బల్దియా, పోలీసులు చూసిచూడనట్లు వదిలేస్తుండటం, స్థానికంగా కొందరు కిందిస్థాయి అధికారులకు అమ్యామ్యాలు అందుతుండటంతో ఈపరిస్థితి నెలకొందనే ఆరోపణలు వస్తున్నాయి.

**ఇప్పటికైనా మేల్కొనాలి..** ప్రభుత్వం ఇప్పటికైనా మేల్కొని నిబంధనలకు విరుద్ధంగా సాగుతున్న వ్యాపార సంస్థలపై కఠినంగా వ్యవహారిస్తునే భవిష్యత్‌లో ఇలాంటి ఘటనలు పునరావృతం అయ్యే అవకాశం ఉండదని నగరవాసులు కోరుతున్నారు. ప్రమాదం జరిగాక హడావిడి చేయడం కన్నా.. ముందే అప్రమత్తమైతే ప్రాణాలతో పాటు ఆస్తినష్టం జరగకుండా కాపాడుకునే అవకాశం ఉంటుందని అంటున్నారు.

# ప్రభుత్వ భూమిలో అక్రమ నిర్మాణాల తొలగింపు

**పదే పదే నిర్మాణాలు చేపడుతూ సవాలు విసురుతున్న గులాబి నేత**



అక్రమ నిర్మాణాన్ని తొలగిస్తున్న రెవెన్యూ అధికారులు

దుండిగల్, మార్చి 17 ప్రభాతవార్త: ప్రభుత్వ స్థలాన్ని ఆక్రమించి అక్రమంగా చేపట్టిన నిర్మాణాలను ప్రభుత్వం కూల్చివేస్తున్నా పదే పదే అక్రమ నిర్మాణాలు చేపట్టి ప్రభుత్వానికి, రెవెన్యూ అధికారులకు సవాళ్లు విసురుతున్నాడు అధికార పార్టీకి చెందిన ఓ నేత. గండిమైస మ్మ దుండిగల్ మండలం భౌరంపేట్ గ్రామం సర్వే నెంబర్821లోని ప్రభుత్వ స్థలంపై కన్నేసిన అధికార పార్టీకి చెందిన ఓ నాయకుడు సుమారు 200గజాలకు పైగా ఆక్రమించి అక్రమంగా నిర్మాణాలు చేపట్టాడు. ప్రభుత్వ స్థలంలో అక్రమ నిర్మాణాలు చేపడుతున్నార సమాచారం అందుకున్న ఆర్ఐ భారతి సంఘటనా స్థలానికి చేరుకొని నిర్మాణాలను కూల్చివేశారు. నిర్మాణాలను కూల్చివేయడంతో ఆగ్రహం చెందిన గులాబీ నేత మరుసటి మరలా అక్రమంగా నిర్మాణం చేపట్టగా విషయం తెలుసుకున్న ఆర్ఐ శుక్రవారం సంఘటనా స్థలానికి చేరుకొని నిర్మాణాన్ని తొలగించారు. అయితే ఆ స్థలం గజం 40వేల రూపాయ లకుపైగా పలుకుతుండడంతో ఎలాగైనా స్వాధీనం చేసుకోవాలని గట్టి ప్రయత్నం చేస్తూ అటు అధికార పార్టీకి, ఇటు రెవెన్యూ అధికారులకు సవాలు విసురుతున్నాడు.

## ఉస్మానియా మెడికల్ కళాశాల వైద్య విద్యార్థులకు అత్యుత్తమ పిజి ర్యాంక్

అఫ్జల్‌గంజ్, మార్చి 17 ప్రభాతవార్త: ఉస్మానియా మెడికల్ కళాశాలకు చెందిన వైద్య విద్యార్దులు అత్యుత్తమ పిజి ర్యాంకులు సాధించి తమ సత్తా చాటారు. ఎన్ఇఇటి పిజి 2023లో జాతీయ స్థాయి ర్యాంకులు ఉస్మానియా మెడికల్ కళాశాలకు చెందిన ఇరువురు వైద్య విద్యార్థులను కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ శశికళారెడ్డి అభినందించారు. ఉస్మానియా మెడికల్ కళాశాలలో వైద్య విద్యను అభ్యసించే పాత బస్తీకి చెందిన జాతీయ స్థాయిలో జీషన్ అహ్మద్ జలీల్ 284వ ర్యాంకును, ఉప్పల్ ప్రాంతానికి చెందిన అశ్రిత 291 ర్యాంకును సాధించడపట్ల సంతోషం వ్యక్తం చేశారు. నగరంలోని డాక్టర్ భాటియా మెడికల్ కోచింగ్ ఇనిస్టిట్యూట్‌కు చెందిన ఐచీవర్స్ క్యాంపస్ నుండి 600మందికి పైగా ర్యాంకులతో విద్యార్దులు మెడికల్ పోస్ట్ గ్రాడ్యుయేట్ సీట్లను సాదించారని, అందులో ఉస్మానియా మెడికల్ కళాశాలకు చెందిన విద్యార్దులు ఇద్దరు ఉండటం పట్ల అచీవర్స్ క్యాంపస్ తెలంగాణ,ఆంధ్రప్రదేశ్ డెరెక్టర్లు సాయి ఇంద్రసేనా, డాక్టర్ సురేందర్‌నాథ్ అభినందించారు.

## దేవాలయాల అభివృద్ధికి కృషి చేస్తా

**మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్**



ఆలయ ప్రారంభోత్సవంలో మాట్లాడుతున్న మంత్రి తలసాని

సంజీవరెడ్డినగర్, మార్చి 17,ప్రభాతవార్త: ఆధ్యాత్మిక కేంద్రాలుగా భాసిల్లు తున్న దేవాలయాల అభివృద్ధికి తనవంతు కృషి చేస్తానని రాష్ట్ర పశుసంవర్ధక, మత్స్య, పాడిపరి శ్రమల మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్ తెలిపారు. శుక్రవారం సనత్ నగర్‌లోని సుభాష్ నగర్‌లో తన వ్యక్తిగత నిధులు 35లక్షలతో పునర్నిర్మించిన ఈదమ్మ మైసమ్మ దేవాలయం ప్రారంభోత్స వం ,విగ్రహ ప్రతిష్ట పూజల్లో మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్, బిఆర్‌ఎస్ సికింద్రాబాద్ ఇంచార్జి తలసాని సాయికిరణ్‌యాదవ్‌లు పాల్గొన్నారు. ఈసందర్భంగా పండి తులు పూర్ణ కుంభంతో స్వాగతం పలికారు. అనంతరం ఆలయ నిర్వాహకులు వారిని ఘనంగా సన్మానించారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ బల్కంపేట్, మహంకాళీ ఆలయం, హనుమాన్ దేవాలయం వంటి ప్రధాన ఆలయాలు సనత్‌నగర్ నియోజకవర్గ పరిధిలోనే ఉండటం మన అదృష్టమన్నారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత ఆలయాలు ఎంతో అభివృద్ధి చెందాయని చెప్పారు. బల్కంపేట ఎల్లమ్మ ఆలయం, మహంకాళీ తదితర ఆలయాల వద్ద భక్తులు సౌకర్యార్థం చేపట్టిన అభివృద్ధి పనుల గురించి వివరించారు. ఆలయాలే కాకుండా ప్రజల అవసరాలను గుర్తించి రోడ్లు, డ్రైనేజీ,వాటర్‌లైన్, విద్యుత్ లైన్‌ల ఏర్పాటు వంటి అనే అభివృద్ధి పనులను పరిష్కరించినట్లు తెలిపారు. స్థానిక మహిళలు అమ్మవారి ఆలయాన్ని అభివృద్ధి చేయాలని చేసిన విజ్ఞప్తి మేరకు ఉగాదిలోగా పునర్నిర్మిస్తామని ఇచ్చిన హామీ మేరకు నేడు ప్రారంభించుకోవడం జరిగిందని వివరించారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ కొలన్ లక్ష్మిబాల్‌రెడ్డి, దేవాదాయ శాఖ డిప్యూటీ కమిషనర్ రామకృష్ణ, అసిస్టెంట్ కమిషనర్ కృష్ణ తదితరులు ఉన్నారు.

# ఆశలు.. అడియాశలాయె..

**లక్ష్యంకోసం వచ్చి.. అసువులు బాశారు ■ స్వప్నలోక్ కాంప్లెక్స్ మృతదేహాలకు పోస్టుమార్టం**

**ఆందోళన జరిపిన బాధిత కుటుంబ సభ్యులు**

**మద్దతు తెలిపిన బీజేపీ, కాంగ్రెస్ నేతలు**

**మార్చ్యురీ వద్ద ఉద్రిక్తత, విషాదచాయలు**

**అదుపులోకి తీసుకున్న పోలీసులు**





ఆందోళన చేస్తున్న కుటుంబ సభ్యులు, నేతలు, రోదిస్తున్న కుటుంబ సభ్యులు

సికింద్రాబాద్, మార్చి 17 ప్రభాతవార్త : ఎన్నో ఆశలతో కుటుంబ బాధ్యతలను తీసుకోవాలనే లక్ష్యంతో ఉద్యోగాలు సాధించేందుకు నగరానికి వచ్చిన యువతి, యువకులు స్వప్నలోక్ అగ్నిప్రమాదంలో అసువులు బాసారు. సికింద్రాబాద్ గాంధీ ఆస్పత్రి మార్చ్యురి వద్ద ఉద్రిక్తల మధ్య వారికి పోస్టుమార్టం నిర్వహించారు. ప్రభుత్వం తరపున బాధిత కుటుంబాలకు రూ. 5లక్షలు నష్టపరిహారం ఇస్తామని మంత్రులు చెబుతుండగా ఒక్కొక్కరికి రూ. 50లక్షలు చెల్లించాల్సిందేనంటు బీజేపీ, కాంగ్రెస్ నేతలు, బాధిత కుటుంబ సభ్యుల ఆందోళన మధ్య పోస్టుమార్టం జరిపారు. కుటుంబ సభ్యుల రోదనలతో మార్చ్యురి ప్రాంగణంలో విశాద చాయలు అలుముకున్నాయి. స్వప్నలోక్ కాంప్లెక్స్‌లో జరిగిన అగ్నిప్రమాదంలో మహబూబ్‌నగర్‌కు జిల్లా కేసముద్రం మండలం ఇంటికన్నే గ్రామానికి చెందిన ఏ. ప్రశాంత్ (23), గూడూరు మండలం మట్టేవాడ గ్రామాంకు చెందిన ప్రమిల(22)లు మృచెందారు. నర్సంపేట చంద్రయ్యపల్లికి చెందిన శివ (23), దుగ్గొండి మండలం మర్రిపల్లి గ్రామానికి చెందిన వంగ వెన్నెల(22), ఖానాపూర్ మండలంలో నివాసం ఉండే బనోతు శ్రావణి(22), ఖమ్మం జిల్లా నేలకొండపల్లి మండలం సుర్దేపల్లికి చెందిన త్రివేణి(22)ల మృతదేహాలకు పోస్టుమార్టం నిర్వహించారు.

**నష్టపరిహారం చెల్లించాలని ఆందోళన..** ఎన్నో ఆశలతో నగరానికి వచ్చి అగ్నిప్రమాదంలో ప్రాణాలు కోల్పోయిన వారి కుటుంబాలకు ప్రభుత్వం నష్టపరిహారం చెల్లించాలని ఆందోళనకు దిగారు. గాంధీఆస్పత్రి మార్చ్యురి వద్ద బాధిత కుటుంబ సభ్యులు ఆందోళన చేస్తుండడంతో పోలీసులు వారిని అదుపు చేయడం కోసం ప్రయత్నించారు. విషయం తెలుసుకున్న బీజేపీ, కాంగ్రెస్ నేతలు గాంధీఆస్పత్రి మార్చ్యురి వద్దకు చేరుకొని బాధిత కుటుంబాలకు ఆండగా నిలిచారు. ఒకవైపు బాధిత కుటుంబ సభ్యుల రోదనలు హృదయాలను కదిలిస్తుండగా, మరోవైపు ఆందోళన చేస్తున్న వారితో గాంధీ మార్చ్యురి ప్రాంగణలో విషాదచాయలు అలుముకున్నాయి.

**ఎక్స్‌గ్రేషియా ప్రకటించిన మంత్రులు..** స్వప్నలోక్ కాంప్లెక్స్ అగ్నిప్రమాదంలో ప్రాణాలు కోల్పోయిన వారి కుటుంబ సభ్యులకు నష్టపరిహారం చెల్లిస్తామని మంత్రులు తలసాని శ్రీనివాస్ యాదవ్, మహముద్‌అలీలు తెలిపారు. మృతదేహాలకు పోస్టుమార్టం జరుగుతుండగా బాధిత కుటుంబ సభ్యులు, బీజేపీ, కాగ్రెస్ నేతలు ఆందోళన జరుపుతుండగా మంత్రులు బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించడం కోసం సికింద్రాబాద్ గాంధీఆస్పత్రి మార్చ్యురికి వచ్చారు. బాధిత కుటుంబ సభ్యులను ఓదార్చారు. మీకు అండగా ఉంటామని హామీ ఇచ్చారు. ప్రభుత్వం తరపున నష్టపరిహారంగా రూ. 5లక్షల చొప్పున ప్రకటించారు. అయితే ఒక్కో కుటుంబానికి రూ. 50లక్షల చొప్పున నష్టపరిహారం చెల్లించాలని ఆందోళన జరుపుతున్నవారు డిమాండ్ చేశారు. దీంతో మార్చ్యురి వద్ద ఉద్రిక్త వాతావరణం నెలకొంది. పెద్దఎత్తున నినాదాలు చేస్తు ఆందోళన ఉద్రుతం అవుతుండడంతో పోలీసులు కల్పించుకున్నారు. ఆందోళన విరమించాలని కోరారు. ఎంతకూ వినకపోవడంతో ఆందోళన జరుపుతున్న వారిని పోలీసులు అదుపులోకి తీసుకొని పోలీసుస్టేషన్‌లకు తరలించారు. కాగా మృతదేహాలకు పోస్టుమార్టం నిర్వహించి కుటుంబ సభ్యులకు అప్పగించారు.

# చట్టాలను గౌరవించాల్సిన పాలకులే విరుద్ధంగా ప్రవర్తించడం సిగ్గు చేటు

**బిసి సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఎర్ర సత్యనారాయణ విమర్శ**



సమావేశంలో మాట్లాడుతున్న ఎర్ర సత్యనారాయణ

సైఫాబాద్, మార్చి 17 ప్రభాతవార్త: విచారణలను ఎదుర్కొని చట్టాలను విధిగా గౌరవించాల్సి న స్థాయిలో ఉండవలిసిన రాష్ట్ర ముఖ్యమంత్రి కెసిఆర్, ఆయన కుమారుడు రాష్ట్ర మంత్రి కెటిఆర్, కుమార్తె ఎమ్మెల్సీ కె.కవిత ఇందుకు విరుద్ధంగా తప్పించుకునే ప్రయత్నాలు చేయడం, దురద్దేశపూర్వకంగా జాప్యం చేయడాన్ని తెలంగాణ రాష్ట్ర బిసి సంక్షేమ సంఘం తీవ్రంగా ఖండించింది. గతంలో ఆలే నరేంద్ర, ఈటల రాజేందర్, డాక్టర్ కె.రాజయ్యలపై దురుద్దేశ్యంగా అవినీతి ఆరోపణలకు పాల్పడ్డారని ముందుండి చర్యలకు దిగిన కెసిఆర్ తన కుమార్తె కవిత అవినీతిపై రక్షించే ప్రయత్నాలు చేయడం దుర్మార్గమని సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఎర్ర సత్యనారాయణ ఆరోపించారు. శుక్రవారం బిసి భవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కొత్త రాష్ట్రం కెసిఆర్ ప్రభుత్వం ఆది నుండి అవినీతిమయమై వ్యవస్థలను, ప్రజలను దుర్బలం చేశాయని, గత 9 సంవత్స రాల కెసిఆర్ పాలనలో ఎన్నికల్లో వేల కోట్ల రూపాయలను ఖర్చు చేయడం, ఈ డబ్బులు ఎక్కడి నుంచి వచ్చాయని ప్రశ్నించారు. సగటు ఓటరు, వివిధ సంఘాలు ప్రత్యక్షంగా వేల కోట్ల రూపాయలు తీసుకున్న సంఘటనలు ప్రతి గ్రామంలో వార్డుల్లో సాక్ష్యాలతో ఉన్నప్పటికి కేంద్ర దర్యాప్తు సంస్థలు, ఎన్నికల కమిషన్ ఎందుకు ఈ అవినీతిని అరికట్టలేకపోయిందని, ఏలాంటి చర్యలు తీసుకోలేకపోయిందో అర్థం కావడం లేదన్నారు. అధికార పార్టీ కుటుంబం దుబాయి కేంద్రంగా లక్షల కోట్లు డబ్బులు విదేశాలకు తరలిస్తున్న ఆరోపణలు ప్రజా బహుళ్యంలో సంబంధిత వర్గాల ప్రచారం చేస్తున్నప్పటికి కేంద్ర దర్యాప్తు సంస్థలు తాత్సారం చేయడంలో అర్థమేమిటని ప్రశ్నిం చారు. మహిళగా తన హక్కు లపై కోర్టుకు వెళ్ళాలే తప్పా విచారణకు సహకరి స్తామని కవిత చెపుతూ ఆఫిడవిట్ ఇవ్వకపోవడాన్ని ఆయన తప్పుపట్టారు. చట్టాను అమలు చేయాల్సి న రాష్ట్ర ప్రభుత్వం కవిత కేసులో చట్టాల ఉల్లంఘునకు నిర్విరామంగా కృషి చేయడం సిగ్గుచేటని సత్యనారాయణ విమర్శించారు. ఈ సమావేశంలో బిసి నాయకులు నీల వెంకటేష్, సుధాకర్‌ముదిరాజ్, వేముల రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## మహిళా రిజర్వేషన్ బిల్లును వెంటనే ఆమోదించాలి

**ప్రజాపరిరక్షణ రాజకీయ వేదిక, తెలంగాణ పొలిటికల్ ఫ్రంట్**



ప్రెస్‌క్లబ్‌లో అభివాదం చేస్తున్న లాలునాయక్,మమతాగౌడ్ తదితరులు

హైదరాబాద్, మార్చి 17,ప్రభాతవార్త: మహిళా రిజర్వేషన్ బిల్లు 33 శాతంను వెంటనే ఆమోదించాలని ప్రజాపరిరక్షణ వేదిక, తెలంగాణ పొలిటికల్ ఫ్రంట్ డిమాండ్ చేసింది. ఈరకు శుక్రవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో వేదిక కోఆర్డినేటర్, బహుజన రాజ్యం పార్టీ జాతీయ అధ్యక్షులు రమావత్ లాలునాయక్ అధ్యక్షతన నిర్వహించిన సమావేశానికి వివిధ రిజిస్టర్ పొలిటికల్‌పార్టీలు, కులసంఘాల అధ్యక్షులు,సంఘ సేవకులు,మేధావులు హాజరై తమ అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ బిసిలకు చట్టసభల్లో 50శాతం రిజర్వేషన్ పార్లమెంట్‌లో రాజ్యాంగ పరంగా హక్కులు కల్పిస్తూ బిల్లును ఆమోదించాలన్నారు. అంతేకాకుండా పెరిగిన జనాభాకు అనుగుణంగా ఎస్.సి.ఎస్.టి బిసి,రిజ్వేషన్ల శాతాన్ని పెంచుతూ బిల్లును ఆమోదించాలన్నారు. ఈకార్యక్రమంలో తెలుగు జనతాపార్టీ అధ్యక్షురాలు పి.మమతాగౌడ్, జైస్వరాజ్ పార్టీ శ్రీనివాస్‌రావు, శివసేన అధ్యక్షులు సుదర్శన్, పార్టీల అధ్యక్షులు పాల్గొన్నారు.

## ఫౌండేషన్ ద్వారా ఉచిత విద్య



అన్నదానం చేస్తున్న జి.జి.వై.ఎఫ్ చైర్మన్ గడ్డం శ్రీనివాస్‌యాదవ్

బేగంబజార్, మార్చి 17 ప్రభాతవార్త: తెలంగాణ ముఖ్యమంత్రి కెసి ఆర్ చేపట్టిన సంక్షేమ పథకాలు ప్రతి ఇంటికి వచ్చినట్లు గోషా మహల్ నియోజకవర్గం బిఆర్‌ఎస్ నాయకులు,గడ్డం గంగా ధర్ ఫౌండేషన్ చైర్మన్ గడ్డం శ్రీనివాస్‌యాదవ్ పేర్కొన్నారు. జి.జి.వై.ఎఫ్ చైర్మన్ గడ్డం శ్రీనివాస్‌యాదవ్ ఆద్వర్యంలో ఆగాపురాలో ఆత్మీయ సమ్మేళన సభ ఏర్పాటు జరిగింది. ఈసందర్బంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి కెసిఆర్ మైనార్టీలకు షాదీముబాకర్ పథకం ద్వారా వారిలో కొత్త జీవితానికి ఉత్సావాన్ని నింపినట్లు తెలిపారు.ఫౌండేషన్ ద్వారా ఇంటర్ నుండి డిగ్రీ,పిజి వరకు నిరుపేద విద్యార్ధి,విద్యార్థులకు ఉచితంగా విద్యను అందిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఆగాపురా వెల్ఫేర్ అసోసియేషన్ ప్రతినిధులు జియోకమల, సయ్యద్ బాషా, మోసిన్‌తోపాటు బిఆర్‌ఎస్ నాయకులు జయశంకర్, మేఘానాయక్, గణేష్, సురేష్, భారతి, సురేష్‌సింగ్ పాల్గొన్నారు.

## కంటి అద్దాలు పంపిణీ



కంటి అద్దాలు అందచేస్తున్న
బిఆర్‌ఎస్ నాయకులు గడ్డం అశీష్‌కుమార్‌యాదవ్

అఫ్జల్‌గంజ్, మార్చి 17 ప్రభాతవార్త: గోషామహల్ నియోజకవర్గంలో రెండవ విడతలో నిర్వహించిన బిఆర్‌ఎస్ నాయకులు గడ్డం ఆశీష్‌కుమార్‌యాదవ్ ఆయుష్ కేంద్రం నిర్వహించిన ఉచిత వైద్య శిబిరం ద్వారా ఉచితంగా 200 మందికి కంటి అద్దాలను అందచేశారు. గోషామహల్ డివిజన్ గోడేకబర్‌లో డిగ్నిటి 2బిహెచ్‌పి కమ్యూనిటిహాల్‌లో ఏర్పాటు చేసిన ఉచిత వైద్య శిభిరంలో 200మందికి కంటి అద్దా లు పంపిణి చేశామన్నారు. త్వరలో మూడవ విడత ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఇన్‌చార్జ్ ప్రేమ్‌కుమార్‌దూత్, నాయకులు బాలముకుంద్, వేణుగోపాల్, అనిల్, సల్మాన్ తదితరులు పాల్గొన్నారు.

## మహిళా దినోత్సవ ముగింపు కార్యక్రమంలో పాల్గొన్న మేయర్



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న మేయర్ కొలన్ నీలాగోపాల్‌రెడ్డి

నిజాంపేట్,మార్చి17 ప్రభాతవార్త: కుత్బుల్లాపూర్ నియోజకవర్గం నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధి మున్సిపల్ కార్యాలయంలోని మల్టీపర్పస్ ఫంక్షన్‌హాల్లో శుక్రవారం నిర్వహించిన మహిళా దినోత్సవ ముగింపు కార్యక్రమాలకు మేయర్ కొలన్ నీలాగోపాల్‌రెడ్డి ముఖ్య అతిధిగా హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ తెలంగాణ ప్రభుత్వం మహిళ కోసం కళ్యాణలక్ష్మీ, షాదీముబారక్ వంటి పథకాలను ప్రవేశపెట్టి వారికి అండగా నిలిచిందన్నారు. మహిళల సాధికారతకై తెలంగాణ ప్రభుత్వం ఎల్లప్పుడూ కృషి చేస్తుందని, మహిళలు ఒక శక్తిగా ఎదిగి అన్ని రంగాల్లో రాణించాలన్నారు. అనంతరం వివిధ పోటీల్లో గెలిచిన మహిళలకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఇంఛార్జి కమిషనర్ రామకృష్ణారావు, డిప్యూటీ మేయర్ ధన్‌రాజ్ యాదవ్, మహిళా కార్పొరేటర్లు, నాయకులు, సిబ్బంది పాల్గొన్నారు.

## అభివృద్ధి పనులు పరిశీలించిన కార్పొరేటర్



కార్పొరేటర్ తోకల శ్రీనివాస్‌రెడ్డి అధికారులతో కలిసి
అభివృద్ధి పనులు పరిశీలిస్తున్న దృశ్యం

మైలార్‌దేవ్‌పల్లి, మార్చి 17 ప్రభాతవార్త : మైలార్‌దేవ్‌పల్లి డివిజన్ పరిధిలోని లక్ష్మీగూడ (బృందావన్ కాలనీ)లో జరుగుతున్న అభివృద్ధి పనులను శుక్రవారం కార్పొరేటర్ తోకల శ్రీనివాస్‌రెడ్డి జిహెచ్‌ఎంసి అధికారులతో కలిసి పరిశీలించారు.ఈ సందర్బంగా కార్పొరేటర్ తోకల శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ నాలా పనులు సకాలంలో పూర్తి చేసి డివిజన్ ప్రజలకు అందుబాటులోకీ తీసుకురావాలని అధికారులను ఆదేశించారు. మైలార్‌దేవ్ పల్లి డివిజన్ ప్రజలకు అన్ని రకాల మౌళిక సదుపాయాలు కల్పన కోసం నిరంతరం కృషి చేస్తున్నానని ఆయన తెలియజేశారు.ఈ కార్యక్రమంలో బిజెపి నాయకులు అడికె జనార్దన్,అడికె శివ శంకర్,మధుకర్,రాజేందర్ సింగ్, చిన్న,శేఖర్‌రెడ్డి,శ్రీనివాస్ రెడ్డి, అధికారులు పాల్గొన్నారు.



నగరంలో జరిగిన ఓ ఫ్యాషన్ కార్యక్రమంలో పాల్గొన్న మోడల్స్

## ప్రాణాలు కోల్పోయిన వారికి 25లక్షలు ఇవ్వాలి

### సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు ఈ టీ నర్సింహా డిమాండ్



స్వప్నలోక్ కాంప్లెక్సు వద్ద ఆందోళన నిర్వహిస్తున్న సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు ఈ టీ నర్సింహా తదితరులు

బేగంపేట మార్చి 17, ప్రభాతవార్త : సికింద్రాబాద్ స్వప్నలోక్ కాంప్లెక్సులో గురువారం రాత్రి జరిగిన అగ్ని ప్రమాద ఘటనలో ప్రాణాలు కోల్పోయిన ఆరు మందికి ఒక్కొక్కరికి 25ల క్షల రూపాయల నష్ట పరిహారాన్ని ప్రభుత్వం అందించాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు ఈ టీ నర్సింహ ఆధ్వర్యంలో శుక్రవారం ఆందోళన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గడచిన రెండు సంవత్సరాల క్రితమే స్వప్నలోక్ కాంప్లెక్సును కూల్చి వేయాలంటూ అధికారులు నోటీసు ఇచ్చారు అని రాజకీయ వత్తిడి అసమర్థ అధికారుల చర్యల వల్ల అగ్ని ప్రమాదం సంభవించి ఆరుమంది ప్రాణాలు కోల్పోవాల్సి వచ్చిందని నర్సింహ ఆరోపించారు. మృతులు అంతా 25సంవత్సరాల వారు వారి కుటుంబాలు వారిపైనే ఆధారపడి ఉన్నాయన్నారు. మృతుల కుటుంబంలో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం తో పాటు 25లక్షల ఎక్స్‌గ్రేషియా ఇవ్వాలని డిమాండ్ చేసారు.ఈ ప్రమాదానికి కారణ మైన అధికారులను ఉద్యోగాల నుంచి తొలగించాలని, క్రిమినల్ కేసులు నమోదు చేసి జైలుకు పంపాలని, భవిష్యత్‌లో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో హైదరాబాద్ జిల్లా కార్యదర్శి ఛాయాదేవి, సహాయ కార్యదర్శి స్టాలిన్, సికింద్రాబాద్ నియోజకవర్గ కార్యదర్శి కాంపల్లి శ్రీనివాస్,సహాయ కార్యదర్శులు ఉమర్‌ఖాన్, కొమెరెల్లి బాబు, తార్నాక డివిజన్ కార్యదర్శి ఎస్.కె. లతీఫ్‌తో పాటు లక్ష్మణ్, కళ్యాణ్ పాల్గొన్నారు.

## కరెంట్ షాక్‌తో పద్మారావునగర్ పార్కులో వాకర్ మృతి



విద్యుత్ షాక్‌తో మృతి చెందిన ప్రదీప్

సికింద్రాబాద్, మార్చి 17 ప్రభాతవార్త : పద్మారావునగర్ పార్కులో వాకింగ్‌కోసం వచ్చిన వ్యక్తి కరెంట్ షాక్‌కొట్టడం వల్ల మృతి చెందాడు. శుక్రవారం తెల్లవారుజామున కురిసిన వర్షానికి పార్కుపైనుంచి వెళుతున్న విద్యుత్ తీగ తెగిపడింది. చూసుకోకుండా కాలువేయడంతో కరెంట్ షాక్‌కొట్టి పార్సిగుట్ట బాపూజినగర్‌కు చెందిన ప్రదీప్ (43) అక్కడికక్కడే ప్రాణాలు విడిచాడు. ఈ సంఘటనతో బాపూజినగర్ వాస్తవ్యులు ఆందోళనకు దిగారు. పార్కువద్దకు చేరుకొని రోడ్డుపై బైటాయించారు. మృతుడి కుటుంబ సభ్యులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. విషయం తెలుసుకున్న మాజీమంత్రి మర్రి శశిధర్‌రెడ్డి, ఇతర బీజేపీ నేతలు బండపల్లి సతీష్, మేకల సారంగపాణి ఇతర నేతలు పార్కువద్దకు చేరుకొని ఆందోళన చేస్తున్న వారికి మద్దతు తెలిపారు.

**ప్రదీప్ మృతి చాలా బాధాకరం : తలసాని శ్రీనివాస్ యాదవ్**

పద్మారావునగర్ పార్కులో వాకింగ్ కోసం వెళ్ళి కరెంట్ షాక్‌కు గురై మృతి చెందిన ప్రదీప్ కుటుంబ సభ్యులకు మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ ప్రగాడ సంతాపం తెలిపారు. ప్రదీప్ కుటుంబానికి అండగా ఉంటానని కుటుంబ సభ్యులకు హామీ ఇచ్చారు. అంతకు ముందు విద్యుత్ శాఖ అధికారులతో చర్చించిన మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ ప్రదీప్ కుటుంబానికి రూ. 5లక్షలు ఆర్థిక సహాయం, ఆపద్బంధు పథకం ద్వారా మరో రూ. 50వేలు ఆర్థిక సహాయంగా, అంత్యక్రియలకు రూ. 10వేలు అందజేసేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. ప్రమాదంపై తగిన విచారణ జరిపించి బాధ్యులైన వారిపై చర్యలు తీసుకుంటామని మంత్రి తలసాని తెలిపారు.

**రాజకీయ లబ్దికోసమే బీజేపీ ఆందోళన : బీఆర్‌ఎస్ నేత గుర్రం పవన్‌కుమార్ గౌడ్**

రాజకీయ లబ్దికోసమే ప్రదీప్ మృతిపై బీజేపీ నాయకులు ఆందోళన చెపట్టారని పద్మారావునగర్ బీఆర్‌ఎస్ పార్టీ ఇన్‌చార్జి గుర్రం పవన్‌కుమార్ గౌడ్ అన్నారు. విద్యుత్ షాక్‌తో ప్రదీప్ మరనించిన విషయం తెలుసుకున్న పవన్‌కుమార్‌గౌడ్, ఇతర బీఆర్‌ఎస్ నేతలు వెంటనే పద్మారావునగర్ పార్కువద్దకు చేరుకొని ఘటనకు సంబంధించిన వివరాలను తెలుసుకున్నారు. మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ దృష్టికి తీసుకువెళ్ళారు. బీజేపీ నాయకులు ప్రదీప్ మృతిరి రాజకీయం చేయకుండా కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి దృష్టికి తీసుకువెళ్ళి మృతుని కుటుంబానికి ఆర్థిక సహాయం అందించి చిత్తశుద్దిని చాటుకోవాలని పవన్‌కుమార్ గౌడ్ హితవు పలికారు. శ్రీకాంత్‌రెడ్డి, వెంకటేషన్‌రాజు, ఏసూరి మహేష్, ముక్కా శ్రీనివాస్‌లు ఈ కార్యాక్రమంలో పాల్గొన్నారు.

## డెవలపర్స్‌ను ప్రారంభించిన ఎమ్మెల్యే

నిజాంపేట్, మార్చి17 ప్రభాతవార్త: కుత్బుల్లాపూర్ నియోజకవర్గం నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధి 2వ డివిజన్‌లోని ప్రగతి నగర్‌లో నూతనంగా ఏర్పాటు చేసిన దియాశ్రీ డిజైన్స్ ఇంటీరియర్స్,డెవలపర్స్‌ను శుక్రవారం ఎమ్మెల్యే కెపి వివేకానంద్ ముఖ్య అతి ధిగా పాల్గొని ప్రారభించారు. ఈ సందర్భంగా డెవలపర్స్ యాజమాన్యానికి శుభాకంక్షలు తెలిపి అభినందించారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర టీవీసీ చైర్మన్ డా.వాసుదేవరెడ్డి, మేయర్ కొలన్ నీలాగోపాల్‌రెడ్డి, డిప్యూటీ మేయర్ ధన్‌రాజ్‌యాదవ్, కార్పొరేటర్లు చిట్ల దివాకర్, సురేష్‌రెడ్డి, బాలాజీనాయక్, ఫ్లోర్ లీడర్ ఆగం పాండు ముదిరాజ్, నాయకులు జగన్‌యాదవ్, జగదీష్‌యాదవ్, రంగ రాయప్రసాద్, సాంబశివరెడ్డి, శ్రీకర్‌గుప్త, మహేందర్‌రెడ్డి, దశరథ్, సబితారెడ్డి, నిర్వాహకుడు రాజ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## సేవా వాలెంటీర్లుగా చేరిన 164 మంది విద్యార్ధులు



ప్రభుత్వ మహిళా కళాశాల
ప్రిన్సిపాల్ డా.పద్మావతిని సత్కరిస్తున్న లియో సభ్యులు

బేగంపేట మార్చి 17, ప్రభాతవార్త : బేగంపేట ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో 164మంది విద్యార్థులు లియోక్లబ్ కార్యక్రమంలో సేవా వాలెంటీర్లుగా చేరారు. కళాశాల ప్రిన్సిపాల్ డా.కె. పద్మావతి మార్గదర్శకత్వంలో లయన్స్‌క్లబ్ ఆఫ్ హైదరాబాద్ బ్లూస్ డిస్ట్రిక్స్320డి లియో క్లబ్‌ను ప్రారంభించింది.ఈ సందర్భంగా పిడిజీ గోవింద్ రాజ్ లియో క్లబ్ ఆఫీసర్లను ప్రసిడెంట్‌గా ఎ.అక్షయ,వైస్ ప్రశిడెంట్ గా మెహర్,సెక్రటరీ మరియూ కోశాధికారిగా దివ్యశ్రీ, లియో సభ్యులుగా ఎన్‌ఎస్‌ఎస్ వాలెంటీర్లుగా ఉన్న 160మంది విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు.లయన్స్‌క్లబ్ అధ్యక్షులు విజయ్ ఆనంద్ ఈ కార్యక్రమానికి అధ్యక్షత వహించారు.కళాశాల అధ్యాపక లియో సమన్వయ కర్త డాక్టర్ డి.సరిత ఆధ్వర్యంలో లియో టాలెంట్ వీక్ నిర్వహించగా విజేతలైన 12మందికి బంగారు, వెండి, కాంస్య పతకాలను విజయ్ ఆనంద్ చేతుల మీదుగా అందజేసారు. గడచిన వారంలో 105మంది విద్యార్థులు డాక్టర్ డి.మహేశ్వరరెడ్డిచే సీపీఆర్ ప్రోగ్రాంలో శిక్షణ పొందారు.లియో సభ్యులు రాష్ట్ర పరిధిలోని వివిధ ప్రాంతాల్లో నిర్వహించిన పలు పోటీలలో పాల్గొని ప్రశంసలు పొందడం ఎంతో సంతోషంగా ఉందని, కళాశాల ప్రిన్సిపాల్ డా.కె.పద్మావతి అన్నారు.

## విద్యార్థినులకు శానిటరీ ప్యాడ్‌లు పంపిణీ



హైదర్షాకోట్‌లోని ప్రభుత్వ పాఠశాల విద్యార్థినులకు ఉచితంగా శానిటరీ పాడ్స్ పంపిణీ చేసిన ఎంపి రంజిత్‌రెడ్డి సతీమణి సీతారెడ్డి

నార్సింగి, మార్చి 17 ప్రభాతవార్త : చేవెళ్ల పార్లమెంట్ నియొజకవర్గంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలలో చదువు తున్న విద్యార్థినులకు ఉచితంగా శానిటరీ ప్యాడ్‌లను పంపిణీ చేస్తామని ఎంపి రంజిత్‌రెడ్డి సతీమణి సీతారెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం గండిపేట మండలం హైదర్షాకోట్‌లోని ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థినులకు శానిటరీ ప్యాడ్‌లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మహిళలు తమ జీవిత కాలంలో ఎదుర్కొనె ప్రధాన సమస్య అయిన రుతుస్రావంపై ఎదిగే వయసులో ఉన్న బాలికలకు అవగాహన పెంచాల్సిన అవసరం ఉందన్నారు. శానిటరీ ప్యాడ్‌లను అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకుంటున్న విద్యార్థినులకు పంపిణీ చేసేందుకు ఏర్పాట్లు చేశామని, మొదటగా గండిపేట్ మండలంలో ప్రారంభించామన్నారు. బాలికలకు రుతుస్రావంపై నిష్ణాతులైన మహిళా వైద్యులతో అవగాహన కల్పిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో రీతు, శ్వేత తదితరులు పాల్గొన్నారు.

## కేంద్ర ప్రభుత్వం బిసిలను చిన్నచూపు చూస్తుంది

### అఖిలపక్ష సమావేశానికి మంత్రి గంగుల కమలాకర్‌కు వినతి



మంత్రి గంగులను ఆహ్వానిస్తున్న కోల జనార్ధన్, గుజ్జకృష్ణ, రాజ్‌కుమార్

హైదరాబాద్, మార్చి 17,ప్రభాతవార్త: కేంద్రప్రభుత్వం ప్రవేశ పెట్టిన బడ్జెట్‌లో బిసిలవాటా పెంచాలని బిసిలను చిన్న చూపు చూడటం తగదని బిసి సంక్షేమ సంఘం నాయకులు డిమాండ్ చేశారు. ఈమేరకు శనివారం బిసి సంక్షేమసంఘం ఆధ్వర్యంలో జరగనున్న అఖిలపక్ష సమావేశానికి హాజరుకావాల్సిందిగా బిసి సంక్షేమశాఖ మంత్రి గంగుల కమలాకర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన 45లక్షల కోట్ల బడ్జెట్‌లో 56శాతం గల బిసిలకు కేవలం రెండు వేలకోట్లు బడ్జెట్ కేటాయించడం బిసిలను తీవ్రంగా అవమానించడం అన్నారు. జనాభా దామాషా ప్రకారం బిసిలబడ్జెట్ పెంచాలని డిమాండ్ చేశారు. త్వరలో జరిగే జనగణనలో కులగణన జరగాలని అలాగే ప్రభుత్వరంగసంస్థల ప్రైవేటీకరణ ఆపాలన్నారు. అంతేకాకుండా బిసిలకు ప్రత్యేకమంత్రిత్వ శాఖ ఏర్పాటు చేయాలని ఈడిమాం డ్లంట న్నింటిపై బిసిసంక్షేమ సంఘం ఆధ్వర్యంలో అఖిలపక్ష సమావేశం నిర్వహిస్తున్నామన్నారు.ఈసమావేశానికి ఎంపి ఆర్.కృష్ణయ్యతోపాటు వివిధ పార్టీల నుంచి ముఖ్యనేతలు హాజరవుతారని పేర్కొన్నారు.ఈకార్యక్రమంలో జాతీయ కన్వీనర్ గుజ్జకృష్ణ, బిసి యువజనసంఘం రాష్ట్ర కన్వీనర్ రాజ్‌కుమార్, బిసి సంక్షేమసంఘం గ్రేటర్ అధ్యక్షులు భూపేష్‌సాగర్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నందగోపాల్, కోలా జనార్థన్ తదితరులు పాల్గొన్నారు.

## భగవన్నామ స్మరణంతో సర్వ పాపాలు తొలగుతాయి

### రాజేంద్రనగర్ ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్



గంధంగూడలోని శివాంజనేయ దేవాలయంలో జరిగిన
ఉత్సవాలలో పాల్గొన్న ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్

నార్సింగి, మార్చి 17 ప్రభాతవార్త : నిత్యం భగవన్నామ స్మరణం చేయడం వలన సర్వ పాపాలు తొలగిపో తాయని రాజేంద్రనగర్ ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్ పేర్కొన్నారు. శుక్రవారం బండ్లగూడ జాగిర్ కార్పోరేషన్ గంధంగూడలో శివాంజనేయ దేవాలయంలో విగ్రహా ప్రతిష్టాపన, ప్రారంభోత్సవాలు వేద పండితుల మంత్రోచ్ఛరణలు, మంగళ వాయిద్యాల మధ్య ఘనంగా జరిగాయి. ఈ వేడుకలకు ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా విచ్చేసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ దేవాలయాలు ప్రశాంతతకు నిలయాలని తెలిపారు. నిత్యం ఆలయ సందర్శన చేయడంను దినచర్యలో భాగంగా చేసుకోవాలని, పెద్దలు నిత్యం ఆలయాలకు వెళ్తూ వెంట తమ బిడ్డలను కూడా తీసుకెళ్లాలన్నారు. హిందూ ధర్మంలో చేసే ప్రతీ కార్యక్రమం సర్వ ప్రాణుల క్షేమాన్ని కోరదిగా ఉంటుందన్నారు. మనసా,వాచా,కర్మణా సనాతన ధర్మాన్ని పాటించడం వలన అన్ని రుగ్మతలకు దూరంగా ఉండవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో మేయర్ బుర్ర మహేందర్‌గౌడ్, బిఆర్‌ఎస్ అధ్యక్షులు గోకరి సురేష్‌గౌడ్, కార్పోరేటర్లు తలారి చంద్రశేఖర్, సాగర్‌గౌడ్, సీనియర్ నాయకులు పాపయ్య యాదవ్, నాగరాజు, తలారి పాండు, సాయిబాబాగౌడ్, భోగాల శ్రీనివాస్, ప్రేమ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## మంత్రి కెటిఆర్ రాజీనామా చేయాలి



లంగర్‌హౌస్ పోలీస్ స్టేషన్
ముందు నిరసన తెలుపుతున్న బిజెపి నాయకులు

మెహిదీపట్నం, మార్చి 17, ప్రభాతవార్త : టిఎస్‌పీఎస్ పేపర్ లీకేజిని నిరసిస్తూ బిజెపి రాష్ట్ర అధ్యక్షులు, కరీంనగర్ ఎంపి బండి సంజయ్ కుమార్ ఆధ్వర్యంలో శుక్రవారం నాంపల్లి గన్‌పార్క్ వద్ద చేపట్టిన నిరసన దీక్షకు మద్దతుగా కార్వాన్ నియోజకవర్గ లంగర్‌హౌస్ డివిజన్‌కు చెందిన బిజెపి నాయకులు భారీగా తరలి వెళ్తుండడంతో లంగర్‌హౌస్ పోలీసులు వారిని అదుపులోకి తీసుకొని అరెస్టు చేశారు. ఈ సందర్భంగా నాయకులు పోలీస్ స్టేషన్‌లోనే రాష్ట్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ నిరసన తెలిపారు. అనంతరం బిజెపి హైదరా బాద్ పార్లమెంట్ కన్వీనర్ అల్వాల ఇంద్రసేనారెడ్డి మాట్లాడు తూ.. రాష్ట్రంలో అవినీతి పాలన కొనసాగుతుందన్నారు. ముఖ్యమంత్రి కేసీఆర్ ఏ ఒక్క వ్యవస్థను వదలడం లేదన్నారు. అన్ని వ్యవస్థలను నిర్వీర్యం చేస్తూ తనగుప్పిట్లోకి తెచ్చుకో వాలని చూస్తున్నారని ఆరోపించారు. కూతురు ఎమ్మెల్సీ కవిత లిక్కర్ వ్యవస్థను దేశవ్యాప్తంగా విస్తరించాలని చూడగా, కొడుకు మంత్రి కేటీఆర్ మాత్రం పేపర్ లీకేజీలను ప్రోత్స హిస్తున్నారని ఆరోపించారు. టిఎస్‌పిఎస్ పేపర్ లీకేజీకి నైతిక బాధ్యత వహిస్తూ మంత్రి కేటీఆర్ తన మంత్రి పదవికి వెంటనే రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. నిరుద్యోగుల జీవితా లతో ఆటలాడొద్దన్నారు. ఆయన వెంట నాయకులు పొన్నం వెంకటరమణ, పూర్ణచందర్‌రావు, శ్రీనివాస్, అంతక్రిష్ణ, శ్యామ్‌లు పాల్గొన్నారు.

## కంటోన్మెంట్ ప్రజల సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేస్తా : రామక్రిష్ణ



వాల్మీకి నగర్‌లో ప్రజా
సమస్యలు తెలుసుకుంటున్న బోర్డు సభ్యుడు రామక్రిష్ణ తదితరులు

కంటోన్మెంట్, మార్చి 17 ప్రభాతవార్త: కంటోన్మెంట్ బోర్డు పరిధిలోని వివిధ ప్రాంతాల అభివృద్ధికి, ప్రజా సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేస్తామని సివిలియన్ నామినేటెడ్ మెంబర్ జె.రామక్రిష్ణ తెలిపారు. బస్తీబాట కార్యక్రమంలో భాగంగా శుక్రవారం 5వ వార్డు వాల్మీకి నగర్‌లోని వివిధ ప్రాంతాల్లో పర్యటించి ప్రజా సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో బిజెపి నాయకులు విజయ్ యాదవ్, మహేశ్, నరేందర్, శివకుమార్, వీరేశ్, నాగేశ్, శేఖర్, స్వామి, విజయ్, రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

## మహిళలు అన్ని రంగాలలో రాణించేందుకు కృషి చేయాలి : ప్రభుత్వవిప్ గాంధీ



మహిళలకు బహుమతి ప్రధానం చేస్తున్న అరికెపూడి గాంధీ

కెపిహెచ్‌బి కాలనీ, మార్చి 17, ప్రభాతవార్త : మహిళలు అన్ని రంగాలలో రాణించేందుకు తమవంతు కృషి చేస్తేనే మహిళా సాధికారిత సాధ్యపడుతుందని ప్రభుత్వవిప్ అరికెపూడి గాంధీ పేర్కొన్నారు. అంతర్జాతీయ మహిళ దినోత్సవాన్ని పురస్కరించుకుని వివేకానందనగర్ డివిజన్ పరిధిలోని పిజెఆర్ ఫంక్షన్ హాల్‌లో కార్పోరేటర్ రోజాదేవి రంగారావు ఆధ్వర్యంలో నిర్వహించిన మహిళ దినోత్సవ వేడుకలలో ప్రభుత్వవిప్ అరికెపూడి గాంధీ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళల కోసం ఇంత పెద్ద కార్యక్రమం నిర్వహించడం అభినందనీయమని, మహిళ సోదరీమణులందరికీ అంతర్జాతీయ మహిళా దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. మహిళలు వంటింటికే పరిమితం కాకుండా అందివచ్చిన అవకాశాలను పునికిపుచ్చుకొని అన్ని రంగాలలో ప్రావీణ్యం సాధించి ఎంచుకున్న రంగంలో ఉన్నత శిఖరాలను అధిరోహించి ఇతరులకు ఆదర్శంగా నిలవాలని సూచించారు. సమాజాన్ని కంటిపాపలా కాపాడే స్త్రీ మూర్తికి అంతర్జాతీయ మహిళా దినోత్సవ శుభాకాంక్షలు తెలియజేస్తున్నానని అదేవిధంగా పుట్టినప్పుటి నుంచి పెళ్ళిఅయ్యి మళ్ళీ శిశువుకు జన్మనిచ్చే వరకు ప్రతీ దశలో అమ్మవలె, అన్నవలె, మేనమామవలె అండగా నిలుస్తున్న కేసిఆర్ తెలంగాణ మహిళా బంధుగా నిలిచారని కొనియాడారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పోరేటర్ మాధవరం రంగారావవు, వివేకానందనగర్ డివిజన్ బిఆర్‌ఎస్ పార్టీ అధ్యక్షులు సంజీవరెడ్డి, ఆంజనేయులు, మోజేస్, చంద్రమోహన్, విద్యసాగర్, రాము, శివసాగర్, సంపత్ తదితరులు పాల్గొన్నారు.

## రేషన్ డీలర్ల సమస్యల పరిష్కారం కోసం కృషి



హైదరాబాద్ జిల్లా రేషన్ డీలర్ల సంక్షేమ సంఘం
అధ్యక్షులు పుస్తె శ్రీ కాంత్‌ను సన్మానిస్తున్న బిఆర్‌ఎస్
నాయకులు పి.రాధాక్రిష్ణ,విజయ్ కుమార్

చార్మినార్, మార్చి 17 ప్రభాతవార్త : రేషన్ డీలర్ల సమస్యల పరిష్కారం కోసం అన్ని విధాల కృషి చేస్తానని హైదరాబాద్ జిల్లా రేషన్ డీలర్ల సంక్షేమ సంఘం నూతన అధ్యక్షులు పుస్తె శ్రీకాంత్ అన్నారు. హైదరాబాద్ జిల్లా రేషన్ డీలర్ల సంక్షేమ సంఘం నూ తన అధ్యక్షులుగా నియమితులైన పాత బస్తీకి చెందిన పుస్తె శ్రీకాంత్‌ను శుక్రవారం పురానాపూల్‌లో మొగల్‌పుర డివిజన్ బిఆర్‌ఎస్ అధ్యక్షులు పుప్పాల రాధాక్రిష్ణా, ప్రధాన కార్యదర్శి విజయ్ కుమార్‌లు కలిసి శాలువ కప్పి సన్మానించారు.

## సిబిఐతో విచారణ జరిపించాలి

మైలార్‌దేవ్‌పల్లి, మార్చి 17 ప్రభాతవార్త : టిఎస్‌పిఎస్‌పి ప్రశ్న పత్రాలు లీకేజి కావటానికి,ప్రస్తుత రాష్ట్రంలో నెలకున్న సంక్షోభానికి రాష్ట్ర ప్రభుత్వం అసమర్ధతతేనని మైలార్‌దేవ్‌పల్లి డివిజన్ కార్పొరేటర్ తోకల శ్రీనివాస్‌రెడ్డి అన్నారు.మైలార్‌దేవ్‌పల్లిలో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్ర బిజెపి అధ్యక్షులు,ఎంపి బండి సంజయ్ అరెస్టును తీవ్రంగా ఖండిస్తున్నానని తెలిపారు. చాలా కాలం నుంచి ఉద్యోగాల కోసం ప్రిపరేషన్ అవుతున్న నిరుద్యోగులు రాత్రి పగలు చదవుతున్నారని, టిఎస్‌పిఎస్‌సి ప్రశ్న పత్రాలు లీక్ కావటంతో నిరుద్యోగులు తీవ్ర నిరాశకు గురయ్యారని ఆయన తెలిపారు. టిఎస్‌పిఎస్‌సిలో రోజు,రోజుకు అవినీతి భాగోతాలు బయటకు వస్తున్నాయని,లీకేజీ వ్యవహారం స్కామ్‌ను ప్రభుత్వం దాచి పెడుతున్నదని ఆయన తెలియజేశారు.

## రంగారెడ్డి జిల్లా టీచర్స్ ఎమ్మెల్సీ అభ్యర్థి విజయం పట్ల బిజెపి శ్రేణుల సంబరాలు



సంబరాలు నిర్వహిస్తున్న బిజెపి శ్రేణులు

కెపిహెచ్‌బి కాలనీ, మార్చి 17, ప్రభాతవార్త : ఉమ్మడి మహబూబ్‌నగర్ హైదరాబాద్ రంగారెడ్డి జిల్లా టీచర్స్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో బిజెపి బలపరిచిన అభ్యర్థి ఏవిఎన్ రెడ్డి ఘన విజయం సాధించడంతో కూకట్‌పల్లిలో బిజెపి శ్రేణులు శుక్రవారం సంబరాలు చేసుకున్నారు. ఏవిఎన్ రెడ్డి గెలుపు సందర్భంగా కూకట్‌పల్లి బిజెపి కార్యాలయం వద్ద అసెంబ్లీ కన్వీనర్ శ్రీకర్‌రావు ఆధ్వర్యంలో ఘనంగా విజయోత్సవ వేడుకలు జరుపుకొని స్వీట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షుడు హరీష్‌రెడ్డి మాట్లాడుతూ ఈ విజయం తెలంగాణ బిజెపి కుటుంబ సభ్యులందరిదిగా తెలియజేస్తూ రాష్ట్ర ప్రజలు నరేంద్రమోడీ పాలనను కోరుకుంటున్నారని అన్నారు. అనంతరం బిజెపి నాయకులు వడ్డేపల్లి రాజేశ్వరరావు మాట్లాడుతూ ఈ విజయం సాధించిన ఏవిఎన్‌రెడ్డికి శుభాకాంక్షలు తెలియజేస్తూ, తెలంగాణాలో బిఆర్‌ఎస్ ప్రభుత్వం రోజు రోజుకు ప్రజల్లో విశ్వాసం కోల్పోతుందని బిజెపిపై రోజురోజుకు ప్రజల్లో నమ్మకం పెరుగుతుందని అన్నారు. ఇందుకు ఉదాహరణ ఈ ఎన్నిక అని ముఖ్యమ ంత్రి కెసిఆర్ భయపడేది కేవలం ఉపాధ్యా యులకు మాత్రమేనని ఉపాధ్యాయులు వారి తీర్పును ఇచ్చేశారని స్పష్టం చేశారు. తెలంగాణ రాష్ట్ర ప్రజల కోరిక మేరకు రాష్ట్రంలో రానుంది బిజెపి ప్రభుత్వం మాత్రమేనని అన్నారు. నిరంకుశ అవినీతి పాలనను రాష్ట్రం నుంచి పారదోలే రోజు దగ్గర్లోనే ఉందని అన్నారు. ఈ వేడుకల్లో ఎన్.సూర్యప్రకాష్‌రావు, కె.మహేందర్, శకంర్‌రెడ్డి, ఎ.వెంకట్‌స్వామి, వినోద్, యం.పద్మయ్య, నాగరాజు, వినోద్, మనోహర్, రమేష్, సంతోష్‌గౌడ్ పాల్గొన్నారు.



మాదాపూర్‌లో జరిగిన సెలబ్రెటీ క్రికెట్ లీగ్ 2023
సెమీఫైనల్, ఫైనల్ లోగోను ఆవిష్కరించిన కెప్టెన్ అకిల్ అక్కినేని

## దేశాన్ని అభివృద్ధి పథంలో నడిపించడానికి మహిళలు కృషి చేయాలి

**రాష్ట్ర హైకోర్టు జడ్జి జస్టిస్ రాధారెడ్డి**



శివపార్వతిని సత్కరిస్తున్న జస్టిస్ రాధారెడ్డి

సైఫాబాద్, మార్చి 17 ప్రభాతవార్త: మనదేశాన్ని అభివృద్ధిపథంలో నడిచేందుకు మహిళలు తమ వంతు కృషి చేయాలని రాష్ట్ర హైకోర్టు జడ్జి జస్టిస్ రాధారెడ్డి పిలుపునిచ్చారు. ఇప్పటికే మహిళలు తమ వంతు కృషి చేస్తున్నారని, ప్రపంచ దేశాలలో గుర్తింపు తీసుకువస్తున్నారని, పురుషులతోపాటు అన్ని రంగాలలో రాణిస్తున్నారని, అయితే ఇంకా సాధించాల్సింది కూడా ఉందని ఆమె స్పష్టం చేశారు. సినీ, టివి రంగాల్లో మహిళలకు సమానవేతనం అందించాల్సిన అవసరం ఉందన్నారు. తెలంగాణ భాషా సాంస్కృతిక శాఖ సహకారంతో అభినందన సంస్థ ఆధ్వర్యంలో రవీంద్రభారతిలో జరిగిన అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకల్లో ఆమె ముఖ్యఅతిధిగా పాల్గొని ప్రసంగించారు. ఈ సందర్భంగా ఆమె పలువురు సినీ, టివి నటులకు అభినందన సీల్‌వెల్ టివి అవార్డులను ప్రదానం చేశారు. ప్రతి రంగంలో మహిళలు రాణిస్తున్నారని భారతీయ మహిళలకు ఆస్కార్ అవార్డు లభించడం సంతోషకరమని భారతీయులందరికి గర్వకారణమన్నారు. ఈ కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర భాషా సంఘం అధ్యక్షుడు పి.విజయబాబు, వంశీరామరాజు, బండారు సుబ్బారావు, ప్రముఖ సినీ, టివి నటులు శివపార్వతి, ప్రతినిగమ్, పద్మ, ఉషారాణి, భారతి, యామిని, గౌతమి, జ్యోతి, భావనరెడ్డి, శిల్పారెడ్డి, సహస్రలను ముఖ్యఅతిధి అవార్డులతో సత్కరించారు.

## అభివృద్ధి పనులను వేగవంతం చేయాలి: ఎమ్మెల్యే కౌసర్ మోహియుద్దీన్



జీహెచ్ఎంసీ ఇంజనీరింగ్ అధికారులతో సమావేశమైన ఎమ్మెల్యే కౌసర్

మెహిదీపట్నం, మార్చి 17, ప్రభాతవార్త : కార్వాన్ నియోజకవర్గంలో జరుగుతున్న పలు అభివృద్ధి పనులను వేగవంతం చేసి పూర్తి చేయాలని స్థానిక ఎమ్మెల్యే కౌసర్ మోహియుద్దీన్ జీహెచ్ఎంసీ ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. రంజాన్ పండుగ సమీపిస్తుండడంతో పెండింగ్‌లో ఉన్నపనులను పూర్తి చేయాలని జీహెచ్ఎంసీ ఇంజనీరింగ్ అధికారులతో శుక్రవారం నానల్‌నగర్ ఎండి లైన్స్ లోని ఫంక్షన్ హాల్‌లో కాంట్రాక్టర్స్‌తో సమావేశాన్ని నిర్వహించారు. సమావేశంలో ఎమ్మెల్యే కౌసర్‌మోహియుద్దీన్ పాల్గొని మాట్లాడారు. కార్వాన్ నియోజకవర్గంలోని అన్ని డివిజన్‌లలో కోట్లాది నిధులతో పలు అభివృద్ధి పనులు కొనసాగుతున్నాయని వాటిని వెంటనే పూర్తి చేసి అందుబాటులోకి తేవాలన్నారు. బాక్స్‌డ్రైప్ వర్క్స్, డ్రైనేజీ, నాలాల పూడిక తీతలు, మరమత్తులు, రోడ్ల ప్యాచ్‌వర్క్స్, సీసీ రోడ్ల నిర్మాణ పనులను వెంటనే పూర్తి చేయాలన్నారు. ఎక్కడ ఎలాంటి సమస్యలున్నా వెంటనే తన దృష్టికి తీసుకురావాలన్నారు. అధికారులు నిత్యం అందుబాటులో ఉంటూ పనుల వేగంను పెంచాలన్నారు. సమావేశంలో గోల్కొండ, నానల్‌నగర్, లంగర్‌హౌస్ కార్పొరేటర్స్ హరాన్ ఫరాన్, మహ్మద్ నసీరుద్దీన్, వజీ ఉజ్జమా సిద్దికి, జీహెచ్ఎంసీ 13 సర్కిల్ ఈఈ.వెంకటశేషయ్య, డిప్యూటీ ఈఈలు రామక్రిష్ణ, శంకర్, ఏఇలు శ్రీకాంత్, ఉదయ్‌లతో పాటు కాంట్రాక్టర్లు పాల్గొన్నారు.

## పాత నగర మున్నూరు కాపు సంఘం నూతన కార్యవర్గం



సమావేశంలో పాల్గొన్న పాత నగరం మున్నూరు కాపు సంఘం ప్రతినిధులు

చార్మినార్, మార్చి 17 ప్రభాతవార్త : హైదరాబాద్ పాతనగరం మున్నూరు కాపు సంఘం నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. పాతనగర మున్నూరు కాపు సంఘం నూతన అధ్యక్షులుగా తిరుపతి శివకుమార్, ఉపాధ్యక్షులుగా అరె.దత్తు, ప్రధాన కార్యదర్శిగా చుక్క అశోక్ కుమార్,సంయుక్త కార్యదర్శిగా తోట అశోక్ కుమార్,కోశాధికారిగా పొన్న బాలరాజులను అంబికానగర్‌లోని సంఘం కార్యాలయంలో జరిగిన సమావేశంలో సభ్యులు ఎన్నుకున్నారని సంఘం అధ్యక్షులు శివ కుమార్ తెలిపారు.పాతబస్తీకి చెందిన మున్నూరు కాపులు రాజకీయ రంగంతో పాటు అన్ని రంగాలలోను మరింత అభివృద్ధి చెందవలసి ఉందని,మున్నూరు కాపుల అభ్యున్నతి కోసం సంఘం అనేక కార్యక్రమాలు చేపట్టిందని ఆ సంఘం కార్యవర్గం ప్రతినిధులు వెల్లడిం చారు. ఈ కార్యక్రమంలో పాతనగర మున్నూరు కాపు సంఘం ప్రతినిధులు భుజం జాపకిరాం,పుస్తె శ్రీకాంత్,కొండూరు వినోద్ కుమార్, కావేటి.గోవిందరాజు,మడిగెల భాస్కర్‌రావు,తిరుపతి శ్రీనివాస్,పల్లె శ్రావణ్,సున్నపు అశ్విని,పున్న సునీత, తిరుపతి పరమేశ్వరి,పొన్నా మాణిక్యాలదేవి,మరిశెట్టి వేణు,కొప్పుల అనిల్ కుమార్,కొమిరి శెట్టి శేఖర్, తిరుపతి రాఘవేంద్ర,మల్లెల ఉపేంద్ర,తిరుపతి నాగరాజు,కెఎస్ ఆనందరావు, పలువురు పాల్గొన్నారు.


**వార్త VAARTHA CLASSIFIEDS**

**FOR SALE**

★ **3BHK Flat,** 7Floor, Apila Gated community. Ready to occupy. **Whatsapp: 9000975095.** 1.95C. Brokers Excuse.

**(Ro.No.58667)**

**CHANGE OF NAME**

★ **I SHIVAJEE ALIAS SHIVAJEE DEOGAM** S/o Late Chandrabhushan R/o Hyderabad- Telangana shall henceforth be known as **SHIVAJEE CHANDRABHUSHAN** for all purposes vide affidavit no. 312 dtd 15.03.2023 sworn before notary R K Arora.

**(Ro.No.58769)**

**గమనిక**

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగినరీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో "వార్త" దినపత్రికకు ఏ విధమైన సంబంధం లేదు.


## బండ్లగూడ జాగీర్‌లో బిజెపి నాయకుల సంబరాలు



ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఎవిఎన్‌రెడ్డి గెలుపు పట్ల బండ్లగూడ జాగీర్ కార్పోరేషన్‌లో సంబరాలు చేసుకుంటున్న బీజేపీ నాయకులు

నార్సింగి, మార్చి 17 ప్రభాతవార్త : ఉపాధ్యాయ ఎమ్మెల్సి ఎన్నికలలో బీజేపీ అభ్యర్థి ఎవిఎన్‌రెడ్డి గెలుపొందడం పట్ల ఆ పార్టీ నాయకులు శుక్రవారం సాయంత్రం సంబరాలు చేసుకున్నారు. పెద్ద ఎత్తున బాణా సంచాను పేలుస్తూ, మిఠాయిలు పంపిణీ చేసి శుభాకాంక్షలు తెలుపుకున్నారు. భారత్‌మాతాకీ జై... నరేంద్రమోడీ నాయకత్వం వర్ధిల్లాలి... అంటూ పెద్ద పెట్టున నినాదాలు చేశారు. అనంతరం సీనియర్ నాయకులు అంజన్‌కుమార్‌గౌడ్ మాట్లాడుతూ మహబూబ్‌నగర్, రంగారెడ్డి, హైదరాబాద్ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలలో భారతీయ జనతా పార్టీ అభ్యర్థిని గెలిపించి కేసీఆర్‌కు ఉపాధ్యాయులు గట్టి గుణపాఠం చెప్పారన్నారు. త్వరలో జరుగబోయే అసెంబ్లీ ఎన్నికల్లో సైతం ఉపాధ్యాయులతో పాటు అన్ని శాఖల ఉద్యోగులంతా బిఆర్ఎస్‌కు, సీఎం కేసీఆర్‌కు కర్రుకాల్చి వాత పెట్టడం తథ్యమన్నారు. ఎన్నికల సమయంలో రాష్ట్ర ప్రజలకిచ్చిన హామీలను మరిచి, అధికార గర్వంతో తమకు న్యాయం చేయాలని కోరిన ఆర్టీసి సంఘం ప్రతినిధుల ప్రాణాలతో ఆటలాడుకున్నారని విమర్శించారు. బిఆర్ఎస్ సర్కారు అంతా అవినీతిమయం అయ్యిందన్నారు. బీజేపీ సీనియర్ నేతలు మహాలింగంగౌడ్, బండ్లగూడ జాగీర్ అధ్యక్షులు మహేష్ యాదవ్, మణికొండ అధ్యక్షులు బరప్ప, నార్సింగి అధ్యక్షులు బిక్షపతి యాదవ్, నాయకులు నరేందర్‌రెడ్డి, మల్లారెడ్డి, దామోదర్‌రెడ్డి, లక్ష్మీనారాయణ, సిద్ధప్ప, నాగేష్ యాదవ్, శ్రీనివాస్, శేఖర్ ముదిరాజ్ పాల్గొన్నారు.

## సుఖ సంతోషాలుతో ఉండాలన్నది ప్రభుత్వ విధానం



మస్జిద్ వద్ద ఎమ్మెల్యే మైనంపల్లి

అల్వాల్, మార్చి 17 ప్రభాతవార్త: అల్వాల్ కౌకూర్‌లో నూతనంగా ఏర్పాటు చేసిన మస్జిద్ మహ్మదియాను మల్కాజిగిరి ఎమ్మెల్యే మైనంపల్లి హనుమంతరావు శుక్రవారం ప్రారంభించడం జరిగింది. స్థానిక కార్పొరేటర్ జితేందర్‌నాథ్‌తో పాటుగా ఎమ్మెల్యే ప్రత్యేక ప్రార్థనలు చేశారు. రాష్ట్రంలో అన్ని మతాలకు చెందిన పౌరులు సుఖ సంతోషాలుతో ఉండాలన్నది ప్రభుత్వ విధానమని మైనంపల్లి వివరించారు. నియోజకవర్గంలో ప్రజలు మధ్య సహృద సాహిత్య వాతావరణం ఉందన్నారు. మహ్మదియా మస్జిద్ నిర్వాహకులకు ఆయన ఈ సందర్భంగా శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఖాజా ఖాన్ అక్రం పాషా అబూ భాయ్ ఫిరోజ్ బిఆర్ఎస్ నేతలు సురేందర్ రెడ్డి శ్రీశైలం రషీద్ ఖాన్ పాషా సయ్యద్ ఆరిఫ్ గౌస్ పాల్గొన్నారు.

## కేసిఆర్ పథకాలు దేశంలో ఆదర్శంగా నిలిచాయి : మంత్రి తలసాని



కల్యాణ లక్ష్మీ చెక్కులను అందజేస్తున్న మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్ తదితరులు

కంటోన్మెంట్,మార్చి 17 ప్రభాతవార్త: ఆడపిల్లతల్లిదండ్రులకు భారం పడకుండా ముఖ్యమంత్రి కేసిఆర్ ప్రవేశపెట్టిన కళ్యాణ లక్ష్మీ,షాదీముబారక్ పథకం ద్వారా ఎంతో మేలు జరుగుతుందని రాష్ట్ర పశుసంవర్ధక,పాడిపరిశ్రమలు, సినిమాటోగ్రాఫీ శాఖల మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ తెలిపారు. సనత్ నగర్ నియోజకవర్గానికి చెందిన 6 మంది లబ్ధిదారులకు మంజూరైన కళ్యాణ లక్ష్మీ, షాదీముబారక్ చెక్కులను శుక్రవారం మారేడ్‌పల్లిలోని తన నివాసంలో మంత్రి చేతుల మీదుగా లబ్ధిదారులకు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్య మంత్రి కేసిఆర్ అన్నివర్గాల ప్రజలను దృష్టిలో ఉంచుకొని దేశంలో ఎక్కడా లేని విధంగా సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నారన్నారు. ఆడపిల్ల తల్లిదండ్రుల ఇబ్బందులు దృష్టిలో ఉంచుకొని 1 లక్ష 116 ఆర్థిక సహాయం అందజేయడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో బేగంపేట్ కార్పొరేటర్ మహేశ్వరీ పాల్గొన్నారు.

## విద్యార్థినీ, విద్యార్థులు పరిశోధన అవకాశాలను సక్రమంగా వినియోగించుకోవాలి

**అసోసియేషన్ ఆఫ్ ఫార్మసీ టీచర్స్ ఆఫ్ ఇండియా దక్షిణప్రాంత ఉపాధ్యక్షుడు డాక్టర్ వెంకటరమణ**



జ్యోతిని వెలిగించి ప్రారంభిస్తున్న ఫార్మ ఎక్స్‌పోర్ట్ ప్రమోషన్ కౌన్సిల్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ డాక్టర్ పి.వి.అప్పాజీ

హైదరాబాద్ మార్చి 17 ప్రభాతవార్త: విద్యార్థినీ, విద్యార్థులు పరిశోధన అవకాశాలను సక్రమంగా వినియోగించుకోవాలని అసోసియేషన్ ఆఫ్ ఫార్మసీ టీచర్స్ ఆఫ్ ఇండియా దక్షిణప్రాంత ఉపాధ్యక్షుడు, పీసీఐ ఈసీ సభ్యుడు డాక్టర్ వెంకటరమణ అన్నారు. బాగ్‌లింగంపల్లి సుందరయ్య విజ్ఞానకేంద్రంలో అవంతి ఫార్మసీ కళాశాల(గుంతపల్లి), అవంతి పీజీ కళాశాల ఆధ్వర్యంలో బయో అధ్యాయన్-2023 రెండు రోజుల జాతీయ సదస్సులో భాగంగా గురువారం 'బయో సైన్సెస్‌లో కొత్త సరిహద్దు-సంభావిత పురోగతి' అంశంపై జరిగిన సదస్సుకు ముఖ్యఅతిథిగా హాజరైన డాక్టర్ వెంకటరమణ ప్రారంభించి ప్రసంగించారు. ఫార్మ ఎక్స్‌పోర్ట్ ప్రమోషన్ కౌన్సిల్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ డాక్టర్ పి.వి.అప్పాజీ మాట్లాడుతూ ప్రపంచంలో జరుగుతున్న ఔషధ ఎగుమతులలో ఎక్కువశాతం మన భారతదేశం నుంచి జరుగుతున్నాయని, ఇది శుభపరిణామం అని అన్నారు. ముగింపు సభకు ముఖ్యఅతిథిగా హాజరైన సిఎస్ఐఆర్ హైదరాబాద్ డైరెక్టర్ డాక్టర్ డి.శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ విద్యార్థినీ, విద్యార్థులంతా అందివచ్చిన అన్నిరకాల అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఉస్మానియా విశ్వవిద్యాలయం సిఎస్ఐఆర్ శాస్త్రవేత్త డాక్టర్ పి.బి.కవికిషోర్ జెనిటిక్స్ గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో అవంతి కళాశాల డైరెక్టర్ డాక్టర్ జయప్రద, ఫార్మసీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ బాలాజీ, డిగ్రీ, పీజీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వీర సోమయ్య, అధ్యాపక బృందం పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

## ప్రతి ఒక్కరు రోడ్డు భద్రత, ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి : ఏసీపీ శంకర్‌రాజు



ప్రసంగిస్తున్న బేగంపేట ట్రాఫిక్ ట్రైనింగ్ ఇన్సిటీట్యూట్ ఏసీపీ జి.శంకర్‌రాజు

చిక్కడపల్లి, మార్చి 17 ప్రభాతవార్త: ప్రతి ఒక్కరు రోడ్డు, ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని బేగంపేట ట్రాఫిక్ ట్రైనింగ్ ఇన్సిటీట్యూట్ ఏసీపీ జి.శంకర్‌రాజు అన్నారు. ప్రమాదాలను నిరోధించడంలో యువత ప్రముఖ పాత్ర పోషించాలని ఆయన సూచించారు. శుక్రవారం రామ్‌నగర్‌లో కాకతీయ హైస్కూల్‌లో విద్యార్థులకు ట్రాఫిక్‌పై అవగాహన సదస్సు జరిగింది. ఈ కార్యక్రమంలో స్కూల్ డైరెక్టర్ గోకా నవీన్, ప్రిన్సిపాల్ పి.శ్రీనివాస్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా విద్యార్థినీ విద్యార్థులను ఉద్దేశించి శంకర్‌రాజు ప్రసంగించారు. విశ్వనగరంగా అభివృద్ధి చెందుతున్న నగరంలో ప్రతి ఒక్కరు ట్రాఫిక్ నిబంధనలను పాటించడం ద్వారా ట్రాఫిక్ సమస్యలకు చెక్‌పెట్టవచ్చని, తద్వారా ప్రమాదాలు తగ్గుతాయన్నారు. ముఖ్యంగా విద్యార్థులు ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘిస్తే భవిష్యత్తు అంధకారమే అవుతుందని, వారికి లభించే ఉద్యోగవకాశాలపై కూడా తీవ్ర ప్రభావం చూపే ప్రమాదం ఉందన్నారు. డ్రైవింగ్ లైసెన్సు లేకుండా డ్రైవ్ చేస్తున్నారని, ఇది చాలా ప్రమాదం అని, ట్రాఫిక్ నిబంధనలు పాటించడంలో విద్యార్థులు ముందుండాలన్నారు. ట్రాఫిక్ నిబంధనలను తప్పకుండా పాటించాలని, ఇతరులు పాటించే విధంగా చేయాలని, ప్రతి ఒక్కరు డ్రైవింగ్ లైసెన్సు తీసుకోవాలని కోరారు. ఆపరేషన్ రోప్, కొత్తగా వచ్చిన మోటార్ వెహికిల్ యాక్ట్-2019లో వచ్చిన మార్పులు చేర్పులు, వివిధ రోడ్ గుర్తులు తదితర అంశాలపై అవగాహన కలిగించారు. ఈ కార్యక్రమంలో టిటిఐ పోలీసు సిబ్బంది మజీద్‌ఖాన్, పద్మావతి, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## సూపర్ మ్యాక్స్ కంపెనీ కార్మికులకు అండగా ఉంటాం



కార్మికుల నిరాహార దీక్షా శిబిరంలో ఎమ్మెల్యే వివేకానంద్

పేట్‌బషీరాబాద్, మార్చి 17 ప్రభాతవార్త: కుత్బుల్లాపూర్ నియోజకవర్గం జీడిమెట్ల ఇండస్ట్రియల్ లోని సూపర్‌మ్యాక్స్ కంపెనీ కార్మికుల 19వ రిలే నిరాహార దీక్షకు శుక్రవారం ఎమ్మెల్యే కెపి వివేకానంద్ సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ సూపర్ మ్యాక్స్ కంపెనీ కార్మికులకు అండగా ఉంటామన్నారు. త్వరలోనే మంత్రి కేటీఆర్‌తో సంప్రదించి కార్మికుల సమస్యలు పరిష్కరించే విధంగా కృషి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో యూనియర్ నాయకులు, సభ్యులు పాల్గొన్నారు.

## బిజెపి నిరసన దీక్ష



బిజెపి నిరసన దీక్షలో పాల్గొన్న బిజెపి సీనియర్ నాయకులు డి.గోపాల్‌జీ

గోషామహల్, మార్చి 17 ప్రభాతవార్త: టిఎస్‌పిఎస్‌సి అక్రమాలపై సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలని కోరుతూ బిజెపి అధ్యక్షులు బండి సంజయ్ చేపట్టిన నిరసన దీక్షకు గోషామహల్ నియోజకవర్గం బిజెపి నాయకులు పెద్ద తరలివెళ్లి దీక్షకు మద్దతు తెలిపారు. గన్‌పార్క్‌వద్ద ప్రభుత్వానికి వ్యతిరేకంగా చేపట్టిన నిరసన దీక్ష కార్యక్రమంలో గోషామహల్ నియోజకవర్గం బిజెపి, ఐసిఎంఆర్ సభ్యులు డి.గోపాల్‌జీ, కన్వీనర్ కృష్ణ,రామ్‌రెడ్డి, హరీష్ బిజెపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్ని మద్దతు తెలిపారు.

## ప్రతిబస్తీ, కాలనీలలో సమస్యల పరిష్కారమే ధ్యేయంగా నిర్వహించే బృహత్తర కార్యక్రమాలే ప్రగతియాత్ర

**కుత్బుల్లాపూర్ శాసనసభ్యులు కె.పి.వివేకానంద్**



చింతల్ డివిజన్ రంగానగర్‌లో కుత్బుల్లాపూర్ శాసనసభ్యులు కె.పి.వివేకానంద్‌కు ఘనస్వాగతం పలుకుతూ.. తిలకం దిద్దుతున్న స్థానిక మహిళలు

కుత్బుల్లాపూర్, మార్చి 17 ప్రభాతవార్త : కుత్బుల్లాపూర్ నియోజకవర్గ పరిధిలోని ప్రతిబస్తీ, కాలనీలలో సమస్యల పరిష్కారమే ధ్యేయంగా నిర్వహించే బృహత్తర కార్యక్రమలే ప్రగతియాత్రఅని కుత్బుల్లాపూర్ శాసనసభ్యులు కె.పి.వివేకానంద్ అన్నారు. శుక్రవారం చింతల్ డివిజన్ పరిధిలోని రంగానగర్ కాలనీ, శ్రీసాయి కాలనీ, దుర్గయ్యనగర్ తదితర ప్రాంతాలలో ప్రగతియాత్రలో భాగంగా స్థానిక నాయకులు, అధికారులతో కలిసి ఆయన పర్యటించారు. ఈసందర్భంగా ప్రధానరోడ్లతో పాటు లంతర్గత రోడ్ల నిర్మాణం, మంచినీరు, విద్యుత్, డ్రైనేజీ తదితర సమస్యలపై ఇచ్చిన ప్రతిహామీని నెరవేర్చినట్లు తెలిపారు. రంగానగర్ సంక్షేమ సంఘ అధ్యక్షులు బండారు వరప్రసాద్‌గుప్తా, ప్రధానకార్యదర్శి లక్ష్మన్‌రావులతో పాటు సంక్షమ సంఘనాయకులు, కార్యకర్తలు ప్రజలు పెద్దఎత్తున పాల్గొని తమ సమస్యలను వివరించగా అక్కడే ఉన్న డిప్యుటీ ఇంజనీరు శిరీక్ష, ఎ.ఇ. సంపత్‌లకు సమస్యలపై తక్షణం చర్యలు చేపట్టాలని ఆదేశించారు. శ్రీసాయికాలనీలో విస్తృతంగా పర్యటించి సిమెంట్‌రోడ్ల నిర్మాణంతోపాటు విన్నవించారని సంక్షేమ సంఘ నాయకులు కన్నెకంటి మల్లేశ్ ఆధ్వర్యంలో వినతిపత్రం సమర్పించారు. దుర్గయ్యనగర్ సంక్షేమ సంఘ అధ్యక్షులు శ్రీశైలంయాదవ్ ఆధ్వర్యంలో స్థానిక సమస్యలపై బస్తీప్రజలు పెద్దఎత్తున ఎంఎల్ఎ కె.పి.వివేకానంద్‌కు సమస్యల పరిష్కారంకోసం వివతిపత్రాలను సమర్పిం చారు. ఎంఎల్ఎ కె.పి.వివేకానంద్ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున తరలివెళ్లి శ్రీసాయి కాలనీ సంక్షేమ సంఘ అధ్యక్షులు కన్నెకంటి పండరిని ఇంటికివెళ్లి కలిసి స్థానిక సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కుత్బుల్లాపూర్ మున్సిపల్ మాజీ వైస్‌చైర్మెన్ టి.లక్ష్మారెడ్డి మాట్లాడుతూ స్థానిక శాసనసభ్యులు కె.పి.వివేకానంద్‌ఆధ్వర్యంలో ప్రజలసంక్షేమం కోసం నిరంతరం కృషిచేస్తున్నారని కొనియాడారు. మాజీ కోఆప్షన్ సభ్యులు సయ్య ద్‌రఫీద్, గాజులరామారం డిప్యుటీ ఇంజనీరు శిరీష, ఎఇ సంపత్ వార్డు సభ్యులు మెహరున్నిస్స బేగం, టిఆర్ఎస్ అధ్యక్షులు హనుమంతరావు, చిరంజీవి గుప్తా, ఆర్.మురళి, న్యాయవాది గొరిగె మధుసుదన్ యాదవ్ పాల్గొన్నారు. దుర్గయ్యనగర్ సంక్షేమ సంఘ అధ్యక్షులు శ్రీశైలంయాదవ్ ఆధ్వర్యంలో సంక్షేమ సంఘ ప్రతినిధులు ఎంఎల్ఎ కె.పి.వివేకానంద్‌ను పెద్దఎత్తున శాలువాలతో సత్కరించి నినాదాలు చేశారు.

## వివేక్‌నగర్ ఆంజనేయస్వామి ఆలయం హుండి ఆదాయం రూ.1లక్ష83వేల180

చిక్కడపల్లి, మార్చి 17 ప్రభాతవార్త: వివేక్‌నగర్ శ్రీ ఆంజనేయస్వామి దేవాలయంలో హుండి లెక్కింపు కార్యక్రమం ఆలయం ఈవో మాచర్ల దేవనాథం, నిర్మాణ కమిటీ చైర్మన్ జి.మురళీప్రసాద్ ఆధ్వర్యంలో జరిగింది. దేవాదాయ ధర్మాదాయ శాఖ పర్యవేక్షణాధికారి సురేఖ పర్యవేక్షణలో లెక్కించగా 51 రోజులకుగాను రూ.1లక్ష83వేల180 ఆదాయం వచ్చింది. ఆలయం ధర్మకర్తలు డాక్టర్ టి.రామకృష్ణ, మురికి గణేష్, బాసాని పద్మ సూర్యప్రకాశ్, అర్చకులు బుగ్గ లక్ష్మీపతిశర్మ, కె.కృష్ణమూర్తి, కందాళ వెంకటాద్రి, జి.పురుషోత్తమాచారి, ఎస్‌బివిఎన్.ఆచార్యులు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.


**తెలంగాణ ప్రభుత్వం**

**హైదరాబాద్ మహానగర పాలక సంస్థ** GHMC

క్ర.సం.1.RFQ No.07/EE(EVDM)/GHMC/2022-23, తేదీ:15.03.2023. పనుల పేరు: వాయిస్ కమ్యూనికేషన్స్ కొరకు నెలవారి అద్దె చార్జీలు SIM తో కూడిన డాటా రేడియో 4G LTE వాకీటాకీ హ్యాండ్‌సెట్ కొరకు కొటేషన్ అభ్యర్ధన. కొటేషన్లను సీల్డు ఎన్వలప్‌లో డైరెక్టొరేట్ ఆఫ్ EV & DM కార్యాలయం, 7వ అంతస్తు, బుద్ధభవన్‌లో దాఖలు చేయవలెను. స్పెసిఫికేషన్లను ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ కార్యాలయం, EV & DM, 6వ అంతస్తు, బుద్ధభవన్, హైదరాబాద్ నుండి పొందవచ్చును. కొటేషన్ల స్వీకరణ ప్రారంభ తేదీ, సమయం: 16.03.2023 మ.12.00గం. నుండి. చివరి తేదీ, సమయం: 23.03.2023 మ.12.00గం. అధికారి పేరు, చిరునామా, ఫోన్ నం. ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ కార్యాలయం, (EVDM) 6వ అంతస్తు, బుద్ధభవన్, హైదరాబాద్, ఫోన్ నం. 040-29880769, ఇ.మెయిల్ ఐడి:eeevdm@gmail.com.

సం/- ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, (EV & DM), GHMC.

DIPR.No.13407-PP/CL/Advt/1/2022-23 తేదీ: 17.03.2023



**PUBLIC NOTICE**

The General Public is hereby informed that my Client **Mr. S.VENUGOPALA SWAMY,** S/o. Late **S.RAJA GOPALAM,** Aged about 68 years, Occ: Retired employee, R/o. 8-2-293/82/JIII/304 K II,Road No 78,Jubilee Hills Hyderabad – 500096., had lost the Original Registered Sale Deed, Vide Document No: 825/1984, Dated 13-02-1984, registered in the office of SRO Sanga reddy., Pertaining to Open Plot Bearing No. 226/A, Block-G, Extent 250 Sq Yards or equivalent to 209.03 Sq meters, in Sy.No. 333, situated at Tellapur, Village & Municipality, Rama chandrapuram Mandal, Sanga reddy District, while travelling from his residence to Jubilee hills check post on his Two Wheeler. My client has made several efforts to trace the said documents but could not found. If any person finds the said documents above mentioned may please return to my Client. Persons returning the Original Docu ment shall be duly rewarded. Hence this Public Notice.

**K.ANAND RAJU**, Advocate,
3rd floor,Abullah khan building ,Madhura Nagar ,Hyderabad
**Mob:9640671501**

**IN THE COURT OF HON'BLE I JUNIOR CIVIL JUDGE AT: L.B. NAGAR**
**O.S. No. 1764 OF 2022**

**Between:**
Auxilium Navajeevana Salesian Sisters ...Plaintiffs
AND
Greater L.B. Nagar Municipal Corporation (GHMC) & Ors ...Defendants
To,
**All Concerned**

**NOTICE**

Please take notice that the above case O.S. No. 1764 of 2022 pending on the file of the Hon'ble I Junior Civil Judge at L.B. Nagar is filed by the Plaintiff to declare the Plaintiff i.e., "Auxilium Navajeevana Salesian Sisters" bearing address, H.No: 2-4-1/HSCG, Gandhi Nagar, Uppal, Hyderabad-500039, as a Charitable Institutions and also to direct the Defendants to grant exemptions as per the law that are entitled and available to any Charitable Institutions to the Plaintiff. Take further notice that O.S. No. 1764 of 2022, stands posted to 31/03/2023 for your appearance either in person or through counsel on the above said date before Hon'ble I Junior Civil Judge at L.B Nagar otherwise the case will be decided as per law. Hence this notice.

**//BY ORDER OF THE COURT//**

**THOMAS GEORGE**
**P C NIRMALA**
**MANAV GECIL THOMAS**
O/o. Thomas George & Associates (Advocates & Solicitors)
174,Satya Nagar Colony Uppal, Hyd-500039
**Tel. 09849253977, 9618574425**
**Email Id : manavgecilthomas@gmail.com**
**Website: www.tglaw.in**

**IN THE COURT OF THE XXV ADDL DISTRICT JUDGE: CITY CIVIL COURT: AT : HYDERABAD**
**G.W.O.P. No. 8 OF 2023**

Between:
1. **Mrs. Anju Puri,** W/o. Late Sanjay Puri, Aged about 52 Years, Occ: Household, R/o H.No.3-6-472/5, Heritage Apartment, Situated at Road No.8, Himayathnagar, Hyderabad. Email ID. NIL.
2. **Master Daksh Puri,** D/o. Late Sanjay Puri, Aged about 14 Years, Occ: Student, R/o H.No.3-6-472/5, Heritage Apartment, Situated at Road No.8, Himayathnagar, Hyderabad. Email ID. NIL. ....PETITIONERS

AND
All Concerned
To,
**All Concerned ...RESPONDENTS**

**NOTICE**

Whereas the Petitioners No.1 and 2 and his Husband **Late Mr. Sanjay Puri** and her daughter Mrs. Sanajana Puri are the Joint owners of the Petition Schedule Property. Hence, the Petitioners have instituted a O.P. against you for Under Section 8(2) of Minority and Guardianship Act, 1956, R/W, Section 29 & 31 of Guardians and Wards Act, in respect of the Petition Schedule Property so you are hereby summoned to appear in this court in person or by pleader on **28.03.2023 at 10.30 A.M.** failing which the Petition will be heard and determined in your absence.

**SCHEDULE OF PROPERTY**

All that 1/3rd undivided joint share in and over the H.No.5-4-702, 5-4-702/1, 5-4-702/2 and 5-4-702/3 Situated at Old Kattal Mandi, Nampally, Hyderabad, T.S. Adm. 74.71 Sq.Yards out of total Adm.224.14 Sq.Yards., and Bounded by: North: Neighbours Property, South: Lane, East: Neighbours Property, West: Road.

(By Order of the Hon'ble Court)
**Sd/- GAURAV KWATRA & Associates**
**Advocates**
**Consel for Petitioner**
E.No.1967/2005,
Email: advocatekwatra@gmail.com
Offce: M1 & M2, H.No.3-6-728, Himayathnagar, Hyderabad.
**Ph: 9885058221.**

**IN THE COURT OF THE HON'BLE VII JUNIOR CIVIL JUDGE, CITY CIVIL COURT AT HYDERABAD**
**O.S. No. 722 OF 2021**

Between:
**M/s Avon Enterprises ...Plaintiff**
And
**M/s PLR Projects Pvt Ltd ...Defendant**
To,
**M/s PLR Projects Pvt Ltd,**
Represented by its Managing Director, Mrs. G.Swarnalatha, Inwinex Towers, Plot No.130, Flat No.3B, Road No.2, Banjara Hills, Hyderabad.
Sir/Madam,
Please take Notice that my client M/s Avon Enterpirses Represented by its Proprietor Veeramani Kalwa has filed the above suit against you for recovery of money. As per the orders passed by the above Hon'ble Court you are hereby directed to appear before the said court on **17.04.2023 at 10.30 AM** in respect of the above matter as otherwise, the matter will be decided in your absence.

(BY ORDER OF THE COURT)
**Sd/- G.VIJAYA BHASKAR REDDY**
**Advocate**
3-6-305/8, Avanthinagar, Basheerbagh, Hyderabad.
**Mobile No.9848810605**

**IN THE COURT OF THE HON'BLE VI ADDL JUNIOR CIVIL JUDGE CUM VI ADDL METROPOLITAN MAGISTRATE, R.R. DIST. AT L.B. NAGAR**
**O.S. No. 1299 OF 2022**

BETWEEN:
1 **Karvan Rani.** W/o. Late Achi Reddy, Aged: 47 Years, Occ; House wife.
2 **Karvan Gopal Reddy,** S/o. Late Achi Reddy, Aged: 27 years. Occ. Employee.
3 **Karvan Gyaneshwar Reddy,** S/o. Late Achi Reddy, Aged: 25 Years. Occ: Pvt. Employee
4 **Karvan Induja Reddy,** Do. Late Achi Reddy, Aged: 23 Years. Occ: Student All are R/o. H.No. 6-42/1. Ganda Reddy Colony, Badangpet, Saroor Nagar, R.R.Dist. ...Plaintiffs

And
1 **Ramidi Muthyam Reddy,** S/o Late Ramidi Balwanth Reddy Plot No.67, House No.3-280/A. DLRL Colony, Prashanthihills. Meerpet(V), Balapur(M), R.R. District Pin code: 500079
2 **All Concerned ...Defendants**
To
**All Concerned ...Defendant No .2**
Please take notice that the above named Plaintiffs have filed a suit for declare the Plaintiffs are the absolute owners and possessors of the Open plot bearing Plot No.145, admeasuring 200 Sq.Yards or 167.2 Sq.Mtrs in Sy. No.78 situated at Balapur Village, Saroor Nagar Revenue Mandal, Bhavani Nagar, Pasumamula village and Grampanchyath, Hayath nagar Revenue Mandal, R R Dist and to declare the Plaintiffs are the legal heirs of Late Karvan Achi Reddy, W/o. Karvan Ganda Reddy.
If any person are persons are having objection or right, title, interest and claim whatsoever in and over the aforementioned property and the legal heirs of Late Karvan Achi Reddy, W/o. Karvan Ganda Reddy, they may appear before the Hon'ble Court on 27/03/2023 at 10:30 A,M, if you fails to appear before the Hon'ble Court on the above said date and time, the case will be decided in your absences as per law.

BY ORDER OF THE HON'BLE COURT
**Sd/- K. RAMAMURTHY, Advocate**
H.No. 8-6-641, Plot No 5A1 Sairam Colony, B.N.Reddy Nagar, Hyderabad

**PUBLICATION OF NOTICE IN PETITION UNDER THE GUARDIAN AND WARDS ACT IN THE COURT OF THE HON'BLE XI ADDL. CHIEF JUDGE CITY CIVIL COURTS, AT HYDERABAD.**
**GWOP NO. 9 OF 2023**

Between:
Varala Prashanth Kumar ...**Petitioner**
**AND**
All Concerned ...**Respondents**

WHEREAS the Petitioner Varala Prashanth Kumar, S/o. Late V. Padmarao, 18-7-466/2/A/8, Ambika Nagar, Uppuguda, Hyderabad-500053, guardian of Kasala Sai Kiran, only son of Late Kasala Sudarshan and Late Manju Kasala, aged 16 years, Minor, R/o. 18-7-466/2/A/8, Ambika Nagar, Uppuguda, Hyderabad-500053 has filed the above petition for appointment of the legal guardian for the following properties of the deceased parents of the minor child for protection and welfare of the minor child.
1. LIC Policy Nos: 649332706 and 649332707 of branch Mehdipatnam, Gudimalkapur Road, Hyderabad, in the name of the father of the minor totaling to Rs.4,89,000
2. Balance Amount of Rs.51,629.84 as on 2-7-2022 in the Savings Bank Account bearing No.103410011087069 of the father of the Minor in the Union Bank of India, JNTU Branch, JNTU Campus, Kukatpally, Hyderabad-500 085
3. Balance Amount of Rs.32,969.30 as on 2-7-2022 in the Savings Bank Account bearing No.103410100115691 of the mother of the Minor namely Manju Kasala in the Union Bank of India, JNTU Branch, JNTU Campus, Kukatpally, Hyderabad-500 085
4. Fixed Deposit Amount of Rs. Rs.3,81,380/- with accrued interest as on 25-03-2023 in the name of the father of the Minor with Customer ID No. 02842520 in Andhra Bank Now Union Bank of India, JNTU Branch, JNTU Campus, Kukatpally, Hyderabad-500 085 Hyderabad-500 085
5. Fixed Deposit Amount of 1,06,660 under pledge with the bank and net amount claim will be rupees 40,114/- in the name of the mother of the Minor namely Manju Kasala with Customer ID No. 43001139 in Andhra Bank Now Union Bank of India, JNTU Branch, JNTU Campus, Kukatpally, Hyderabad-500 085
6. Pensioner benefits and family pension in respect of the father of the Minor from the JNTUHCEH, Kukatpally, Hyderabad
7. Fixed Deposit Amount of Rs.67505/- with accrued interest as on 29-09-2022 in the name of the father of the Minor with Customer ID No. 02842520 in Andhra Bank Now Union Bank of India, JNTU Branch, JNTU Campus, Kukatpally, Hyderabad-500 085
8.All that the Piece and Parcel of Open Plot bearing No. 18, admeasuring 248 Sq. Yds. or 208 Sq. Meters in Sy. No. 297/uu2, situated at Muthangi Village, MPP Patancheru, ZPP Medak at Sangareddy, under the Jurisdiction of District Registrar Medak at Sangareddy, and bounded by North: Park, South: Plot No.17, East: Plot No.19 and West:30' Wide Road.
9. Fixed Deposit Amount of Rs. Rs.63,711/- with accrued interest as on 25-03-2023 in the name of the mother of the Minor namely Manju Kasala with Customer ID No. 43001139 in Andhra Bank Now Union Bank of India, JNTU Branch, JNTU Campus, Kukatpally.
This notice is hereby issued to the respondents regarding the institution of this petition. If any person has any objection to the grant of permission to the petitioner for appointment as the legal guardian of the said minor child, then he/she should appear in the court on **28-03-2023 at 10.30 a.m** either in person or through an authorised agent or lawyer for filing objections failing which the petition shall be decided in accordance with law. Given as per the orders of the Hon'ble Court **23rd February, 2023**

**M.V. PAVAN KUMAR, M.SEKHER**
Advocates
Plot No.42NP, H.No.25-42, Road No.5, SSR Nagar Colony, Almasguda, Hyderabad-112

## బిజెపితోనే అభివృద్ధి సాధ్యం : కార్పొరేటర్ భాగ్యలక్ష్మి



సంబురాలు నిర్వహిస్తున్న కార్పొరేటర్లు భాగ్యలక్ష్మి, అరుణ

**మలక్‌పేట, మార్చి 17 ప్రభాతవార్త :** బిజెపితోనే అభివృద్ధి సాధ్యమని మూసారాంబాగ్‌డివిజన్ కార్పొరేటర్ బొక్క భాగ్య లక్ష్మి పేర్కొన్నారు. మహబూబ్‌నగర్, రంగారెడ్డి, హైదరాబాద్ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలలో ఉమ్మడి సంఘాల అభ్యర్థి ఎవిఎన్‌రెడ్డి విజయం సాధించడంతో సలీంనగర్‌లో సైదాబాద్ డివిజన్ కార్పొరేటర్ కొత్తకాపు అరుణ రవీందర్ రెడ్డి, నాయకులు, కార్యకర్తలతో కలిసి ఆమె బాణా సంచా కాల్చి మిఠాయిలు పంచి పెట్టి సంబురాలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఉపాధ్యాయులు, బిజెపి బలపర్చిన అభ్యర్థి ఎవిఎన్‌రెడ్డికి ఓటు వేసి గెలిపించడం అభినందనీయమన్నారు. రానున్న ఎన్నికలలో బిజెపి విజయం సాధించి అధికారంలోకి రావడం ఖాయమని ధీమా వ్యక్తం చేసారు. ఈ కార్యక్రమంలో నాయకులు సందడి సురేందర్‌రెడ్డి, మధుకర్, జక్క మోహన్‌రెడ్డి, నవీన్‌రెడ్డి, కొప్పుల దినేష్, బొక్క మధుసూదన్‌రెడ్డి, రాజుముదిరాజ్, వినోద్, ప్రవీణ్, సురేందర్, గణేష్ తదితరులు పాల్గొన్నారు.

## బిజెపి అభ్యర్థి ఘన విజయం : శ్రీవాణి



ఏవిఎన్ రెడ్డిని సన్మానిస్తున్న కార్పొరేటర్ శ్రీవాణి

**ఎల్.బి.నగర్, మార్చి 17 ప్రభాతవార్త :** ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలలో బిజెపి బలపరిచిన అభ్యర్థి ఏవిఎన్ రెడ్డి ఘన విజయం సాధించారని సరూర్‌నగర్ డివిజన్ కార్పొరేటర్ ఆకుల శ్రీవాణిఅంజన్‌కుమార్ పేర్కొన్నారు.ఎన్నికలలో ఘన విజయం సాధించిన ఏవిఎన్ రెడ్డిని శుక్రవారం కార్పొరేటర్ శాలువాతో సత్కరించి అభినందన తెలియజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఎన్నికలకు భయపడి పోటీ చేయని బిఆర్ఎస్ నాయకులు దేశాన్ని ఏం ఉద్ధరిద్దామని చూస్తున్నారని ఎద్దేవా చేశారు. మేధావులైన ఉపాధ్యాయులు ఏవిఎన్‌రెడ్డిని గెలిపించడంపట్ల ఉపాధ్యాయులకు కృతజ్ఞతలు తెలియజేశారు. కార్యక్రమంలో నాయకులు అంజన్‌కుమార్, బెంగరబోయిన సురేష్, దిలీప్, ఆదర్శ్ పాల్గొన్నారు.

## కార్పొరేటర్ శ్రీవాణికి సత్కారం

**ఎల్.బి.నగర్, మార్చి 17 ప్రభాతవార్త :** సరూర్‌నగర్ డివిజన్ లక్ష్మీనగర్‌కాలనీ సంక్షేమ సంఘం నూతన కమిటీ ఎన్నికై ప్రమాణ స్వీకారం చేసిన సందర్భంగా డివిజన్ కార్పొరేటర్ ఆకుల శ్రీవాణిఅంజన్‌కుమార్‌ను కలిసి శాలువాతో ఘనంగా సత్కరించారు. అదేవిధంగా కాలనీలో ఉన్న పలు సమస్యలను గురించి కార్పొరేటర్‌కు వివరించి పరిష్కరించే విధంగా చర్యలు చేపట్టాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో లక్ష్మీనగర్‌కాలనీ సంక్షేమసంఘం అధ్యక్షుడు ఎస్.వాయుకుమార్, ప్రధానకార్యదర్శి మందుల శ్రీధర్‌రాజ్, కోశాధికారి బి.నిరంజన్‌రెడ్డి, మహేష్‌యాదవ్, కాలనీ ప్రతినిధులు పాల్గొన్నారు.

## మహిళలకు బిఆర్ఎస్ నాయకుల సత్కారం

**ఎల్.బి.నగర్, మార్చి 17 ప్రభాతవార్త :** గడ్డిఅన్నారం డివిజన్ భారాస పార్టీ ఆధ్వర్యంలో అంతర్జాతీయ మహిళ దినోత్సవం వేడుకలు శారదనగర్ కమ్యూనిటీ హాల్‌లో శుక్రవారం పార్టీ మహిళా నాయకులను శాలువాలతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ భవాని ప్రవీణ్‌కుమార్, డివిజన్ అధ్యక్షులు శ్రీశైలంయాదవ్, మాజీ కౌన్సిలర్ ప్రేమ్ నాథ్‌గౌడ్, నాయకులు బిచినేపల్లి వెంకటేశ్వరరావు, బబ్బురి ఆనంద్‌గౌడ్,బాలాగౌడ్, పడిదం కృష్ణరెడ్డి, రమణరెడ్డి, రవీందర్‌రెడ్డి, కృష్ణ, విక్కీగౌడ్, యాదిరెడ్డి, సత్యంగౌడ్, మల్లిక, శైలజ, విజయలక్ష్మి, పరమేశ్వరి, లక్ష్మి, వాణి, అరుంధతి, పద్మ, నాగమణి, ఉమ, హసీనా, వరలక్ష్మి పాల్గొన్నారు.

## ఎవిఎన్‌రెడ్డితో బిజెపిలో నూతనోత్సాహం: అందెల

**సరూర్‌నగర్, మార్చి 17 ప్రభాతవార్త:** మహబూబ్‌నగర్, రంగారెడ్డి, హైదరాబాద్ జిల్లాల ఉపాధ్యాయ శాసనమండలి నియోజకవర్గ ఎన్నికల్లో బిజెపి బలపరచిన తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం అభ్యర్థి ఎవిఎన్‌రెడ్డి విజయం సాధించడం పట్ల మహేశ్వరం నియోజకవర్గ బిజెపి ఇంఛార్జి అందెల శ్రీరాములు యాదవ్ హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన ఎవిఎన్‌రెడ్డికి శుభాకాంక్షలు తెలిపారు. బిజెపి బలపరచిన అభ్యర్థి గెలుపు కారణంలో పార్టీ శ్రేణుల్లో కొత్త ఉత్సాహం వచ్చిందని అన్నారు.

## ట్రాఫిక్ పోలీసులకు కంటి పరీక్షలు : ఎసిపి శ్రీనివాసరావు




ఉచిత కంటి వైద్య శిబిరంలో పాల్గొన్న ఎసిపి శ్రీనివాసరావు, సిఐ మక్బూల్ జానీ తదితరులు

**ఉప్పల్, మార్చి 17 ప్రభాతవార్త :** మాక్సీ విజన్, క్లోవ్ హాస్పిటల్ ఆధ్వర్యంలో శుక్రవారం ఉప్పల్ ట్రాఫిక్ పోలీసులకు కంటి, దంత వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమాన్ని ట్రాఫిక్ ఎసిపి శ్రీనివాసరావు ముఖ్య అతిథిగా పాల్గొని ప్రారంభించారు. విధి నిర్వహణలో ఉన్న ట్రాఫిక్ పోలీసులు ఆరోగ్యం పట్ల కూడా తగు శ్రద్ధ వహించాలని, నిత్యం రోడ్లపై విధులు నిర్వహించే ట్రాఫిక్ పోలీసులు అనారోగ్యానికి గురికాకుండా తగు శ్రద్ధ వహించాలని సూచించారు. పోలీసులు కంటి, దంత ఆరోగ్యం విషయంలో తగు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. మాక్సి విజన్ కంటి ఆసుపత్రి, క్లోవ్ డెంటల్ ఆసుపత్రి వైద్య పరీక్షలు నిర్వహించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా పలువురు పోలీసులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ట్రాఫిక్ సిఐ మక్బూల్ జానీ, ఎస్ఐ చిరంజీవి, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

## సైబర్ నేరాలపై విద్యార్థులకు అవగాహన : సిఐ గోవిందరెడ్డి



సైబర్ నేరాలపై అవగాహన కల్పిస్తున్న సిఐ గోవిందరెడ్డి

**ఉప్పల్, మార్చి 17 ప్రభాతవార్త :** సైబర్ నేరాల నివారణ, మాదక ద్రవ్యాలు, ర్యాగింగ్ నిరోదం, మహిళల భద్రత తదితర అంశాలపై శుక్రవారం రామంతాపూర్‌లోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో విద్యార్థులకు పోలీసులు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో ఉప్పల్ సిఐ ఆర్.గోవిందరెడ్డి, ఎస్ఐ సుధాకర్‌రెడ్డి, నెహ్రూ, కళాశాల ప్రిన్సిపల్ ఎ.వినయ్‌కుమార్, సురేష్ తదితరులు పాల్గొన్నారు. అనంతరం జరిగిన కార్యక్రమంలో సిఐ గోవిందరెడ్డి మాట్లాడుతూ విద్యార్థులు సామాజిక విలువలు, సమయం యొక్క ప్రాముఖ్యత గుర్తించాలని సూచించారు. విద్యార్థులు ఆనందంగా ఉంటూ చదువుల గురించి శ్రద్ద వహించాలని సూచించారు. సైబర్ నేరాల పట్ల అవగాహన కలిగి ఉండాలని, మాదక ద్రవ్యాల నివారణ గురించి తగు శ్రద్ద తీసుకోవాలని సూచించారు. చట్ట వ్యతిరేక కార్యకలాపాల గురించి సమాచారం అందితే పోలీసులకు సమాచారం అందించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పలువురు విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## ఎస్సీ సంక్షేమ నేతలకు సత్కారం



సంఘం నేతలను సత్కరిస్తున్న కార్పొరేటర్ గీత తదితరులు

**ఉప్పల్, మార్చి 17 ప్రభాతవార్త :** చిలుకానగర్ డివిజన్ ఎస్సీ మాదిగ సంక్షేమ సేవా సంఘం నేతలను శుక్రవారం స్థానిక కార్పొరేటర్ బన్నాల గీతప్రవీణ్ ఆధ్వర్యంలో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ గీతప్రవీణ్ మాట్లాడుతూ ఎస్సీ సంక్షేమ సంఘం అభివృద్ధికి తమ వంతు కృషి చేస్తామన్నారు. బిఆర్ఎస్ పార్టీతోనే ఎస్సీలకు తగు న్యాయం జరుగుతుందని, ఐక్యంగా ఉండి సంఘం నేతలు తమ సమస్యలు సాధించుకోవాలని కోరారు. ఈ సందర్భంగా సంఘం అధ్యక్షుడు పార్నంది నర్సింగ్‌రావు, కార్యదర్శి ఎం.రాంచందర్, పి.పరుశరాములు, డా.అంతగల్ల అశోక్, సలహాదారులు కె.యాదగిరి, వి.యాదగిరి, జోగు సుదర్శన్, ఎర్రవెల్లి ఎల్లయ్యలను ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ సీనియర్ నాయకులు ఏదుల కొండల్‌రెడ్డి, కొక్కొండ జగన్, అశోక్‌చారి, రామానుజం, బాలు, శ్యామ్ తదితరులు పాల్గొన్నారు.

## మలుపు తిప్పనున్న ఎమ్మెల్సీ ఎన్నికల ఫలితం: చెరుకుపల్లి

**సరూర్‌నగర్, మార్చి 17 ప్రభాతవార్త:** మహబూబ్‌నగర్, రంగారెడ్డి, హైదరాబాద్ జిల్లాల ఉపాధ్యాయ శాసనమండలి నియోజకవర్గ ఎన్నికల్లో బిజెపి బలపరచిన తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం అభ్యర్థి ఎవిఎన్‌రెడ్డి గెలుపు రాజకీయాలను మలుపు తిప్పుతుందని బడంగ్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్ బిజెపి అధ్యక్షుడు చెరుకుపల్లి వెంకట్‌రెడ్డి అన్నారు. ఎవిఎన్‌రెడ్డి గెలుపు పట్ల హర్షం వ్యక్తం చేసిన ఆయన మాట్లాడుతూ ఈ ఎన్నిక ద్వారా రాష్ట్రంలో బిజెపి పుంజుకుంటుందనేది స్పష్టమవుతున్నదని తెలిపారు. ఉపాధ్యాయులు, నిరుద్యోగులు, మేధావులు, కార్మికులు, కర్షకులు బిజెపి వైపు మొగ్గు చూపుతున్నారనీ ఈ నేపథ్యంలో వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో బిజెపి అత్యధిక ఎమ్మెల్యే స్థానాలు సాధించి రాష్ట్రంలో అధికారంలోకి వస్తుందని ఆయన ధీమా వ్యక్తం చేశారు.

## అరెస్టుల ద్వారా ఉద్యమాలను ఆపలేరు: గుడ్ల శ్రీనివాస్

**సరూర్‌నగర్, మార్చి 17 ప్రభాతవార్త:** అరెస్టుల ద్వారా ఉద్యమాలను ఆపలేరని మహేశ్వరం నియోజకవర్గం బిఎస్‌పి అధ్యక్షుడు గుడ్ల శ్రీనివాస్ స్పష్టం చేశారు. తెలంగాణలో అన్యాయమవుతున్న నిరుద్యోగ యువత పక్షాన ఆమరణ దీక్షకు పూనుకున్న బిఎస్‌పి రాష్ట్ర అధ్యక్షుడు ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్‌కు మద్దతుగా దీక్ష చేస్తున్న గుడ్ల శ్రీనివాస్ తదితరులు పోలీసులు అరెస్టు చేశారు. ఈ సందర్భంగా ఆయన అరెస్టులను ఖండిస్తూ ప్రభుత్వ తీరుపై ధ్వజమెత్తారు. ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ అక్రమ అరెస్టును ఖండిస్తూ అన్ని ప్రాంతాల్లో బహుజనులు ఉద్యమాలు చేయాలని పిలుపునిచ్చారు.

## మాదవరం సెరినిటీ అధ్యక్షుడిగా శశివర్ధన్‌రెడ్డి

**సైదాబాద్, మార్చి 17 ప్రభాతవార్త :** గ్రేటర్ కమ్యూనిటీ మాధవరం సెరినిటీ అపార్ట్‌మెంట్ అధ్యక్షులుగా కొట్టం శశివర్ధన్ రెడ్డి ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా శుక్రవారం క్లబ్ హౌస్‌లో పదవి బాధ్యతలను స్వీకరించారు. ఉపాధ్యక్షులుగా బండారు మోహనమ్మ, ప్రధాన కార్యదర్శిగా తాండ్ర ప్రవీణ్ రెడ్డి, జాయింట్ సెక్రటరీగా అన్నం అనిల్ రెడ్డి, కోశాధికారిగా పెనుగొండ మునివెంకటసుబ్బయ్య, ఆర్గనైజింగ్ సెక్రటరీగా ఆలంపల్లి రమేష్‌లను జనరల్ బాడీ సమావేశంలో ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా అధ్యక్షులు మాట్లాడుతూ సొసైటీలో ఏ సమస్య లేకుండా అందరితో కలుపుకొని చూస్తామని తెలిపారు. తమను ఎన్నుకున్నందుకు సభ్యులందరికీ ధన్యవాదములు తెలిపారు.

## హరిహర క్షేత్రంలో ఉగాది వేడుకలు

**మలక్‌పేట, మార్చి 17 ప్రభాతవార్త :** మలక్‌పేట పల్టాన్‌లోని శ్రీ హరిహరక్షేత్రంలో ఈ నెల 22వ తేదీ బుధవారం ఉగాది పర్వదినంసందర్భంగా సాయంత్రం 5.30 గంటలకు దేవాలయంలో పంచాంగ శ్రవణ వేడుకలు నిర్వహించనున్నట్లు ఆలయ ఫౌండర్ ట్రస్టీ సూగూరు రమేష్ తెలిపారు. భక్తులు అధికసంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని సూచించారు. అదేవిధంగా ఈ నెల 30వ తేదీ గురువారం శ్రీరామనవమి పురస్కరించుకుని శ్రీ సీతారామచంద్ర స్వామివారి కళ్యాణాన్ని ఘనంగా నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. మధ్యాహ్నం 12.30 గంటలనుండి ప్రసాద వితరణ నిర్వహించడం జరుగుతున్నారు. ఏప్రిల్ 6వ తేదీ గురువారం హనుమజ్జయంతి వేడుకలను ఘనంగా నిర్వహిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఇఒ జోషి మార్తాండరావు, సభ్యులు కాసుల చంద్రశేఖర్ శర్మ, మంగళగిరి శ్రీనివాసాచార్యులు, రొద్ద రమేష్, సరాపు శ్రీహరి, శెట్టి విజయ్‌కుమార్, వనం సత్యేందర్, పారిజాతారెడ్డి, రేణుఅగర్వాల్ తదితరులు పాల్గొన్నారు.

## కేసిఆర్ ప్రభుత్వానికి రోజులు దగ్గర పడ్డాయి : సామ



ఆనందోత్సాహాలలో సామ రంగారెడ్డి, కార్పొరేటర్లు

**మన్సూరాబాద్, మార్చి 17 ప్రభాతవార్త:** యావత్ తెలంగాణ బిజెపి వైపు చూస్తుందనడానికి నిదర్శనం ఉపాధ్యాయుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఏవిఎన్‌రెడ్డి విజయం సాధించడమేనని రంగారెడ్డి అర్బన్ జిల్లా అధ్యక్షుడు సామరంగారెడ్డి పేర్కొన్నారు. హైదరాబాద్, రంగారెడ్డి, మహబూబ్‌నగర్ ఉపాధ్యాయుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో బిజెపి బలపరిచిన అభ్యర్థి ఏవిఎన్ రెడ్డి విజయం సాధించడంతో బిజెపి శ్రేణులు ఎల్‌బినగర్ చౌరస్తాలో బాణాసంచా కాల్చి స్వీట్లు పంపిణీ చేసి సంబరాలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా సామ మాట్లాడుతూ ఈ ఎన్నికల్లో ఏవిఎన్‌రెడ్డి గెలుపుకు కృషి చేసిన అధ్యాపకులకు, ఉపాధ్యాకులకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. రాష్ట్రంలో కేసిఆర్ ప్రభుత్వం అన్ని వర్గాల వారిని నట్టేట ముంచిందని, విధ్యార్థి లోకాన్ని విస్మరించిన కేసిఆర్‌కు ఈ విజయం చెంపపెట్టు లాంటిదన్నారు.కేసిఆర్ ప్రభుత్వానికి రోజులు దగ్గర పడ్డాయని, తెలంగాణలో సబ్బండ వర్గాలు బిజెపి విజయాన్ని కోరుకుంటుందని ఆయన ఆశాభావం వ్యక్తంచేశారు. కార్యక్రమంలో కొప్పుల నర్సింహారెడ్డి, రంగనర్సింహగుప్తా, నవజీవన్‌రెడ్డి, ఉపేందర్‌రెడ్డి, చింతల సురేందర్‌యాదవ్, ప్రేమ్ మహేశ్వర్‌రెడ్డి, జీవన్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా సింహ వాహన యంత్ర విగ్రహ ప్రతిష్ట



పూజలు నిర్వహిస్తున్న కార్పొరేటర్ లచ్చిరెడ్డి, లక్ష్మీప్రసన్న

**వనస్థలిపురం, మార్చి 17 ప్రభాతవార్త :** బి.యన్.రెడ్డి నగర్ డివిజన్‌పరిధిలోని బి.యన్.రెడ్డినగర్ ఫేస్1 శ్రీదేవి పోచమ్మ, శ్రీ దాసాంజనేయ, శ్రీ కాశీ విశ్వనాథ్ దేవాలయంలో ధ్వజ, ఉష్ట్ర వాహన అమ్మవారి సింహ వాహన యంత్ర విగ్రహ ప్రతిష్టల కార్యక్రమంలో డివిజన్ కార్పొరేటర్ మొద్దు లచ్చిరెడ్డి పాల్గొని పూజ కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ చైర్మన్ రాజిరెడ్డి, కాలనీ అధ్యక్షులు పుర్షోతం రెడ్డి, సాయి బాబు, బిక్షపతి, పార్టీ చేనేత మోర్చ కన్వీనర్ రఘురాం నేత, మంగపతిరావు, కాలనీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు. అదే విధంగా ఈ ప్రతిష్ట మహోత్సవ వేడుకలలో మాజీ కార్పొరేటర్ ముద్దగౌని లక్ష్మి ప్రసన్న రామ్మోహన్ గౌడ్ పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సాయిబాబు, ఇందిరారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## ఎవిఎన్‌రెడ్డి గెలుపుతో బిజెపి నాయకుల సంబరాలు



పార్టీ నేతలకు మిఠాయిలు తినిపిస్తున్న కొలన్ శంకర్‌రెడ్డి

**సరూర్‌నగర్, మార్చి 17 ప్రభాతవార్త:** మహబూబ్‌నగర్, రంగారెడ్డి, హైదరాబాద్ జిల్లాల ఉపాధ్యాయ శాసనమండలి నియోజకవర్గఎన్నికల్లో బిజెపి బలపరచిన తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం అభ్యర్థి ఎవిఎన్‌రెడ్డి విజయం సాధించడంపట్ల మీర్‌పేట్ చౌరస్తాలో బిజెపి నాయకులు సంబరాలు జరిపారు. మీర్‌పేట్ కార్పొరేషన్ బిజెపి అధ్యక్షుడు పెండ్యాల నర్సింహ, కార్పొరేషన్ కౌన్సిల్ బిజెపి ఫ్లోర్ లీడర్ కీసర గోవర్ధన్‌రెడ్డిల ఆధ్వర్యంలో జరిపిన సంబరాలకు ముఖ్య అతిథిగా రాష్ట్ర బిజెపి సీనియర్ నాయకుడు, సింగిల్ విండో మాజీ చైర్మన్ కొలన్ శంకర్‌రెడ్డి హాజరై పార్టీ శ్రేణులకు మిఠాయిలు పంచి పెట్టారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు కోడూరు సోమేశ్వర్, గాజుల మధు, సూల ప్రభాకర్, ఆర్.యాదగిరి యాదవ్, బెల్లంకొండ నాగరాజు, చీలంపల్లి రాజశేఖర్, కార్పొరేటర్లు పసునూరి బిక్షపతిచారి, కీసర గోవర్ధన్‌రెడ్డిలతో పాటు శ్రీను నాయక్, గోలి శ్రీనివాస్‌రెడ్డి, జెడి కుమార్, విక్కీ సాగర్, బచ్చనమోని కాశీరాం యాదవ్, వంగూరి గోపినాథ్, జగన్ ముదిరాజ్, వేణుగోపాల్‌రెడ్డి, రంగారెడ్డి, తిరుపతిరెడ్డి, కృష్ణ, వరికుప్పల బుచ్చిరాములు, చెవ్వ శ్రవణ్‌కుమార్, రాఘవేందర్‌గౌడ్, శ్రీనివాస్, స్వామి తదితరులు పాల్గొన్నారు.

## నేరాల కట్టడికి సిసి కెమెరాలు ఎంతో అవసరం : పవన్‌కుమార్



ప్రారంభోత్సవం చేస్తున్న పవన్‌కుమార్, నాగేశ్వరరావు

**ఎల్.బి.నగర్, మార్చి 17 ప్రభాతవార్త :** నేరాలు జరగకుండా ఉండడానికి సీసీ కెమెరాలు ఎంతగానో ఉపయోగపడతాయని కొత్తపేట డివిజన్ కార్పొరేటర్ పవన్‌కుమార్, ఎల్బీనగర్ మున్సిపల్ మాజీ వైస్‌చైర్మన్ లింగాల నాగేశ్వరరావు పేర్కొన్నారు. డివిజన్‌లోని కమర్షియల్ టాక్స్‌కాలనీ కమ్యూనిటీ హాల్లో నూతనంగా ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలను శుక్రవారం పవన్‌కుమార్, లింగాల నాగేశ్వరరావు ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతి కాలనీలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కాలనీ అధ్యక్షులు అంజయ్యగౌడ్, విశ్వేశ్వరరావు, రాంచందర్‌రెడ్డి, సత్యనారాయణ, మంచి రాజేష్, రాహుల్‌గౌడ్, రామకృష్ణ, సైదుల్, రాకేష్‌యాదవ్, కొత్త తిరుమల, గట్టు మహేష్, వెంకట్‌రెడ్డి, శరణ్ పాల్గొన్నారు.

## సంక్షేమ పథకాలు వివరిస్తూ ప్రశాంత్‌రెడ్డి పాదయాత్ర



సమస్యలపై మహిళతో మాట్లాడుతున్న ప్రశాంత్‌రెడ్డి

**హయత్‌నగర్, మార్చి 17 ప్రభాతవార్త:** క్షేత్ర స్థాయిలో ప్రజా సమస్యలను తెలుసుకుని వాటి పరిష్కారానికి కృషిచేయడంతోపాటు ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించడమే లక్ష్యంగా ప్రగతి నివేదన యాత్రను కొనసాగిస్తున్నట్లు బీఆర్ఎస్ నాయకులు మంచిరెడ్డి ప్రశాంత్‌రెడ్డి అన్నారు. ప్రగతి నివేదన యాత్రలో భాగంగా శుక్రవారం పెద్దఅంబర్‌పేట మున్సిపాలిటీలో 55వ రోజు పాదయాత్ర ముగిసింది. ఈ క్రమంలో 700 కిలోమీటర్ల మేర పాదయాత్ర దాటిన సందర్భంగా పార్టీ మున్సిపాలిటీ కమిటీ అధ్యక్షుడు సిద్ధంకి కృష్ణారెడ్డి ఆధ్వర్యంలో బీఆర్ఎస్ శ్రేణులు కేకును కోయించారు. ఈ సందర్భంగా ప్రశాంత్‌రెడ్డి మాట్లాడుతూ మున్సిపాలిటీ పరిధిలో ప్రధానమైన డ్రైనేజీ సమస్యను ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డి దృష్టికి తీసుకువెళ్లి సమస్య శాశ్వత పరిష్కారానికి కృషిచేస్తానన్నారు. పెద్దఅంబర్‌పేట మున్సిపాలిటీ జీహెచ్ఎంసీకి ఆనుకుని ఉందని మున్సిపాలిటీ రోజురోజుకు విస్తరిస్తున్న నేపథ్యంలో తాగునీరు, డ్రైనేజీ, రోడ్లు వంటి మౌళిక సదుపాయాలను కల్పించడానికి చర్యలు తీసుకుంటామన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వం పేదల సంక్షేమమే ధ్యేయంగా పనిచేస్తోందని, ప్రభుత్వ పథకాలు ఇంటింటికీ అందేలా పార్టీ నాయకులు,కార్యకర్తలు పాటుపడాలన్నారు. కార్యక్రమంలో నాయకులు పాలడుగు నాగార్జున పాల్గొన్నారు.

## శారదా లక్ష్మీ నర్సింహ స్వామి ఆలయంలో శాంతి కళ్యాణం



శాంతి కళ్యాణంలో పాల్గొన్న వంటేరు నర్సింహారెడ్డి తదితరులు

**సరూర్‌నగర్, మార్చి 17 ప్రభాతవార్త:** మీర్‌పేట్ కార్పొరేషన్ జిల్లెలగూడ ఓల్డ్ గాయత్రీనగర్‌లోని శ్రీ శారదా లక్ష్మీ నర్సింహస్వామి దేవాలయంలో స్వామివారి శాంతి కళ్యాణం ఘనంగా జరిగింది. దేవాలయ పంచమ వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆలయ కమిటీ ఆధ్వర్యంలో శాంతి కళ్యాణాన్ని, లక్ష పుష్పార్చన పూజను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ కార్యక్రమాల్లో తిరుమల తిరుపతి దేవస్థానం ప్రధాన వ్యాఖ్యాత డాక్టర్ డివి హయగ్రీవాచార్యులు, స్థానిక 20వ డివిజన్ బిఆర్ఎస్ అధ్యక్షుడు వంటేరు నర్సింహారెడ్డి, ఆలయ కమిటీ అధ్యక్షుడు వెంకటేశ్వరరావు, కార్యదర్శి రాజేశ్వర్‌రెడ్డి, సభ్యులు మధుసూదన్‌రెడ్డి, వెంకటేశ్, హరిబాబు, కిశోర్ రెడ్డి, దామోదర్‌రెడ్డి, వెంకట్‌రెడ్డి, భాస్కర్‌రెడ్డి, వేణు మాధవ్, సత్యనారాయణరెడ్డి, దీక్షితులు, బాజా కృష్ణ, శ్రవణ్‌కుమార్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## అనాధాశ్రమానికి భాగ్యనగర్ మహిళా సంఘం చేయూత



అనాధాశ్రమానికి బియ్యం అందజేస్తున్న నిర్మల

**ఎల్.బి.నగర్, మార్చి 17 ప్రభాతవార్త :** ప్రపంచ మహిళా దినోత్సవం పురస్కరించుకొని భాగ్యనగర్ మహిళా సంఘం ఆధ్వర్యంలో పలు కార్యక్రమాలు నిర్వహించారు. బోడుప్పల్‌లోని భరతమాత అనాధ ఆశ్రమానికి బియ్యం, దుస్తులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా అనాధాశ్రమంలో పలు ఆటపాటల పోటీలను నిర్వహించారు. పోటీలో గెలుపొందిన విజేతలకు బహుమతులను పంపిణీ చేసినట్లు భాగ్యనగర్ మహిళా సంఘం అధ్యక్షురాలు ఉప్పల నిర్మల తెలిపారు. ఈ కార్యక్రమంలో సంఘంఅధ్యక్షురాలు ఉప్పల నిర్మల, ప్రధాన కార్యదర్శి ప్రశాంతిగుప్తా, కోశాధికారి పావని, సభ్యులు సరోజ, భారతి, శ్రీవాణిచౌదరి, శాంత, భారతమ్మ, కవిత, శారద, శైలజ, భాగ్యలక్ష్మి, వరలక్ష్మి పాల్గొన్నారు.

## నూతన విద్యుత్ దీపాలు ఏర్పాటు చేయాలి : ఎమ్మెల్యే అహ్మద్ బలాల



అధికారులతో సమీక్ష సమావేశాన్ని నిర్వహిస్తున్న ఎమ్మెల్యే బలాల

**మలక్‌పేట, మార్చి 17 ప్రభాతవార్త :** మలక్‌పేట నియోజకవర్గంలోని పలు ప్రాంతాల్లో నూతన విద్యుత్ దీపాలను ఏర్పాటు చేయాలని ఎమ్మెల్యే అహ్మద్ బలాల పేర్కొన్నారు. స్ట్రీట్‌లైట్ ఎంటమాలజీ, వెటర్నరీ అధికారులతో ఎమ్మెల్యే సమీక్షా సమావేశాన్ని నిర్వహించి వివిధ అంశాల గురించి చర్చించారు. నూతన వీధిదీపాలను వెంటనే ఏర్పాటు చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. వీధి కుక్కల విషయంలో తగిన జాగ్రత్త చర్యలు చేపట్టాలని వెటర్నరీ అధికారులకు ఆయన సూచించారు. దోమల నివారణకోసం ఫాగింగ్ చేపట్టడడంతోపాటు యాంటీ లార్వా మందును నియోజకవర్గంలోని అన్ని ప్రాంతాల్లో చల్లాలని అధికారులకు తెలిపారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు సాలం షాహిద్, మినాజుద్దీన్, నాయకులు సైపుద్దీన్ షఫీ, అబ్రార్, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## అనాధ ఆడపిల్ల పెళ్లికి ఆర్థిక సహాయం : ఎమ్మెల్యే మైనంపల్లి



స్వాతికి ఆర్థిక సహాయాన్ని అందజేస్తున్న నిరంజన్ తదితరులు

**మల్కాజిగిరి, మార్చి 17 ప్రభాతవార్త :** అనాధ ఆడపిల్ల స్వాతి పెళ్లికి మల్కాజిగిరి ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంతరావు 25 వేల రూపాయలు, మల్కాజిగిరి నియోజకవర్గం బిఆర్ఎస్ మీడియా సెల్ కన్వీనర్ గుండా నిరంజన్ 10 వేలు రూపాయల ఆర్థిక సహాయాన్ని అందజేశారు. వినాయక్‌నగర్‌లో నివాసముండే స్వాతికి తల్లి దేవిక రెండు సంవత్సరాల క్రితం క్యాన్సర్ వ్యాధితో, 9 సంవత్సరాల క్రితం తండ్రి హరి రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. స్వాతి వినాయక్‌నగర్‌లోని తన మేనత్త శారద దగ్గర నివాసం ఉంటుంది. స్వాతికి పెళ్లి కుదరింది. ఆర్థిక స్తోమత లేకపోవడంతో గుండా నిరంజన్ దృష్టికి తీసుకెళ్లగా ఆయన ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంతరావుచే రూ.25వేల రూపాయలు, నిరంజన్ రూ. 10 వేలు ఆర్థిక సహాయాన్ని శుక్రవారం మల్కాజిగిరిలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో స్వాతికి ఈ ఆర్థిక సహాయాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో డివిజన్ టీఆర్ఎస్ అధ్యక్షుడు సురేష్, ప్రధాన కార్యదర్శి బాలక్రిష్ణ, నాయకులు ఫరీద్, చంద్రకాంత్, యాదగిరి తదితరులు పాల్గొన్నారు

## కదలలేని స్థితిలో ఉన్న యువతికి ఎంపిఆర్ చేయూత



యువతికి చేయూత అందిస్తున్న పరమేశ్వర్‌రెడ్డి తదితరులు

**ఉప్పల్, మార్చి 17 ప్రభాతవార్త :** కదలలేని స్థితిలో ఇబ్బంది పడుతున్న ఒక యువతికి కాంగ్రెస్ పార్టీ ఏ బ్లాక్ అధ్యక్షుడు మందముల్ల పరమేశ్వర్‌రెడ్డి చేయూత అందించారు. రామంతాపూర్ ఇందిరానగర్‌కు చెందిన స్రవంతి అనే యువతి అరుదైన సమస్యతో ఇబ్బందిపడుతోంది. వీల్‌చైర్ మీద కూర్చో వడం, బెడ్‌మీద పడుకోవడం తప్ప నడవలేని స్థితిలో ఉన్న యువతికి సెమీ ఫోల్డర్ బెడ్ అందజేసినట్లు పరమేశ్వర్ రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ యువతి కుటుంబ సభ్యుల అభ్యర్థన మేరకు స్రవంతికి అన్ని విధాలుగా అనువుగా ఉండే సెమి ఫోల్డర్ బెడ్‌ను తెప్పించి అందజేసినట్లు తెలిపారు. ఆనారోగ్యంతో ఇబ్బంది పడుతున్న వారికి తమ వంతు చేయూత అందిస్తామన్నారు. కార్యక్రమంలో టిపిసిసి ప్రతినిధి తౌఫిక్, సుర్వి మురళీగౌడ్, పూస సత్యనారాయణ, ఉపేందర్‌రెడ్డి, డివిజన్ వర్కింగ్ అధ్యక్షుడు వల్లపు శ్రీకాంత్‌యాదవ్, కార్యదర్శి సందీప్, సతీస్‌గౌడ్, సాయి యాదవ్, యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు ముత్యాల యోగి విశాల్, భాస్కర్, జగపతి, పాలడుగు లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

## ఏవిఎన్‌రెడ్డి విజయంతో బిజెపి నేతలు సంబరాలు



స్వీట్లు పంచి సంబరాలు చేసుకుంటున్న కార్పొరేటర్లు కక్కిరేణి చేతన, బండారు శ్రీవాణి వెంకట్రావ్, బిజెపి నేతలు

**ఉప్పల్, మార్చి 17 ప్రభాతవార్త :** ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో బిజెపి బలపర్చిన ఏవిఎన్‌రెడ్డి విజయం సాధించడంపట్ల ఉప్పల్ సర్కిల్‌లో బిజెపి నేతలు సంబరాలు చేసుకున్నారు. ఉప్పల్, రామంతాపూర్, హబ్సిగూడ, చిలుకానగర్ తదితర ప్రాంతాల్లో బిజెపి నేతలు ర్యాలీలు నిర్వహించి స్వీట్లు పంచి సంబరాలు చేసుకున్నారు. ఈ సందర్భంగా రామంతాపూర్‌లో కార్పొరేటర్ బండారు శ్రీవాణి వెంకట్రావ్ ఆధ్వర్యంలో ప్రధాన రహదారిపై ర్యాలీ నిర్వహించి స్వీట్లు పంచి సంబరాలు చేసుకున్నారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ బిజెపి బలపర్చిన ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థి ఏవిఎన్‌రెడ్డి విజయం సాధించడం అభినందనీయమన్నారు. వచ్చే ఎన్నికల్లో బిజెపి జెండా ఎగురవేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో బిజెపి సీనియర్‌నాయకులు ఎం.జగదీష్, తాళ్ల మంగ, కీర్తి, సోమశేఖర్‌గౌడ్, డివిజన్ కార్యదర్శి సంకూరి కుమారస్వామి, నారాయణదాసు, కందకట్ల దయానందరెడ్డి, పి.మహేశ్వర్‌రెడ్డి, బద్రీనాద్, కామేష్, కృష్ణయ్య, పర్వతాలు, నోముల శాంతికుమార్, వెంకన్న, తుమ్మలి రవి, సాయి దీరజ్, ఆనంద్, సంతోష్‌గుప్త తదితరులు పాల్గొన్నారు.

**హబ్సిగూడలో...** హబ్సిగూడలోని పలు ప్రాంతాల్లో స్థానిక కార్పొరేటర్ కక్కిరేణి చేతన ఆధ్వర్యంలో ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో విజయం సాధించడం పట్ల బిజెపి నేతలు సంబరాలు చేసుకున్నారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో కార్పొరేటర్ కక్కిరేణి చేతన మాట్లాడుతూ ఉపాధ్యాయ ఎన్నికల్లో బిజెపి బలపర్చిన అభ్యర్థి ఏవిఎన్‌రెడ్డిని గెలిపించడం అభినందనీయమన్నారు. వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో బిజెపి విజయం ఖాయమన్నారు. ఈ కార్యక్రమంలో బిజెపి సీనియర్ నాయకులు సంజయ్‌పటేల్, సుమన్‌రావు, రాఘవరెడ్డి, రంగ రవి, హేమంత్‌మూలే పాల్గొన్నారు.

**ఉప్పల్‌లో...** ఉప్పల్‌లో ఉపాధ్యాయఎన్నికల్లో బిజెపి అభ్యర్థి విజయం సాధించడం పట్ల హర్షం వ్యక్తం చేస్తూ బిజెపి నేతలు సంబరాలు చేసుకున్నారు. బిజెపి డివిజన్ అధ్యక్షుడు రెడ్డిగారి దేవేందర్‌రెడ్డి ఆధ్వర్యంలో బిజెపి సీనియర్ నాయకులు గోరిగె కృష్ణ, మహంకాళి లక్ష్మణ్, మార్న్ని ఫణీందర్, సింగారం కార్తీక్, తీగ విఠల్‌రావు, వర్కల రాజేందర్‌గౌడ్, గోరిగె వెంకటేష్, సముద్రాల నవీన్, ఎల్లగోని ప్రకాష్‌గౌడ్, నవీన్‌గౌడ్, గుండె పుణేందర్ తదితరులు స్వీట్లు పంచి సంబరాలు చేసుకున్నారు. ఈ సందర్భంగా భారీ ఎత్తున ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పలువురు బిజెపి నేతలు పాల్గొన్నారు. అదే విధంగా చిలుకానగర్‌లో బిజెపి డివిజన్ అధ్యక్షుడు గోనె శ్రీకాంత్ ముదిరాజ్ ఆధ్వర్యంలో బిజెపి అసెంబ్లీ కన్వీనర్ దేవసాని బాలచందర్, స్వామి యాదవ్ తదితరులు స్వీట్లు పంచి సంబరాలు చేసుకున్నారు.